


భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 314 పేజీలు: 8 సంపాదకులు: రొళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు ఆదివారం, 06 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 314 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR SUNDAY, 06 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




# 4 రాష్ట్రాల్లో జనగణన


## - ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 05:** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముం దుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసిం ది. ఈ ఏడాది డిసెంబర్ 1న మిగతా2లో...

# పే-రివిజన్ కమిషన్ నియమిస్తాం

## - 2 పెండింగ్ డీఏలను విడుదల చేస్తాం

● గత ప్రభుత్వం రద్దు చేసిన అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ ● ఈహెచ్‌ఎస్ స్ట్రీమ్ లైన్.. 2022 ఏడాది సరెండర్ లీవుల విడుదల: ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 05:** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్య మంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకు న్నారు. 12వ పే-రివిజన్ కమిషన్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. అలాగే పెండింగులో ఉన్న 4 డీఏల్లో 2 డీఏల విడుదలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. వీటితో పాటు మరికొన్ని ముఖ్యమైన పెండింగ్ అంశాలకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రాష్ట్ర ఆదాయ-వ్యయాల లెక్కలను ఉద్యోగుల ముందు ఉంచారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా.... ఉద్యోగుల సమస్యల పట్ల సానుకూలతతో ఉన్నామని ముఖ్యమంత్రి తెలిపారు. మిగతా2లో...

## ఉక్రెయిన్‌పై దాడులకు విరామం.. పుతిన్ కీలక ఆదేశం



**మాస్కో: సెప్టెంబర్ 05:** రష్యా-ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న యుద్ధంలో శనివారంనాడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా సైన్యాన్ని మిగతా2లో...

## రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా : అయ్యన్నపాత్రుడు



**అమరావతి, సెప్టెంబర్ 05:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టంచేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు పైబడటంవల్ల మిగతా2లో...

# విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు

## టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాల్సిందే: ముఖ్యమంత్రి చంద్రబాబు




**విజయవాడ, సెప్టెంబర్ 05:** విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులు హాజరయ్యారు. చంద్రబాబు ఏమన్నారంటే...దేశ భవిత అయిన వి ద్యార్థులను తీర్చిదిద్దుతోన్న టీచర్లందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు. రాష్ట్ర అభి వృద్ధి జరగాలంటే ఉపాధ్యాయుల నియామకాలు మిగతా2లో...



## ఏపీలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్న కూటమి సర్కార్

### - వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

**అమరావతి, సెప్టెంబర్ 05:** ఏపీలో నిర్వహించిన డీఎస్సీ 2025 నియామకాల కుంభకోణంలో రోజు రోజుకు కొత్త విషయాలు బయటపడుతున్నాయని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఈ డీఎస్సీ అక్రమాలపై సోషల్ మీడియా , వివిధ ప్రసార మిగతా2లో...

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...



**హైదరాబాద్, సెప్టెంబర్ 05:** హైదరాబాద్‌లో భారీ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు టీసీఎస్ అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ ఏకంగా రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్‌తో వేలాది మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉండటంతో పాటు, హైదరాబాద్‌కు గ్లోబల్ ఏఐ రంగంలో మరింత కీలక స్థానం దక్కనుంది. పీటీఐ కథనం ప్రకారం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అనుబంధ సంస్థ హైపర్‌వాల్ట్ హైదరాబాద్‌లో 264 ఎకరాల భూమిని దక్కించుకున్నట్లు శనివారం ప్రకటించింది. ఇక్కడ భారీ స్థాయిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు.ఈ డేటా సెంటర్ సామర్థ్యం మిగతా2లో...

దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్

హైదరాబాద్‌లో టీసీఎస్ రూ.70వేల కోట్ల పెట్టుబడి

గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో క్యాంపస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కీలక సమావేశం

దేశానికే ఇది చారిత్రాత్మక ప్రాజెక్టు: సీఎం రేవంత్




2లో

# ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

## - అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, చైర్మన్

# పే-రివిజన్ కమిషన్ నియమిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు కొన్ని కీలక నిర్ణయాలను సీఎం ప్రకటించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకరించారు. అలాగే 1-7-2024, 1-1-2025లకు చెందిన రెండు డీఏల విడుదలకు ఆమోదం తెలిపారు. ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. ఇక 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవులను వచ్చే సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాలో వేయడానికి అంగీకరించారు. ఇక పోలీసులకు 1 అడిషనల్ సరెండర్ లీవ్‌ను ఈ దసరాకు చెల్లించేందుకు ముఖ్యమంత్రి సుముఖత వ్యక్తం చేశారు. ఇక గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి ఇచ్చేందుకు నిర్ణయించారు. దీంట్లో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిని వారికి 15 శాతం మేర అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ వర్తింప చేయనున్నారు. ఇక ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను స్ట్రీమ్ లైన్ చేస్తూ వచ్చే నెల నుంచే ఏ నెలకు ఆ నెల ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లింపులు జరపాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాలతో ఏటా రూ.2,880 కోట్లు ప్రభుత్వానికి ఖర్చు కానుంది.

**రూ.30 వేల కోట్లకు పైగా పెండింగ్ బకాయిలు చెల్లించాం** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..." మన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... గత రెండేళ్ల కాలంలో ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు ఇస్తున్నాం.. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు ఇస్తున్నాం. 11 వేల మంది సీపీఎస్ ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపచేశాం. ఉద్యోగులకు సంబంధించి ఉన్న పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ. 30,849 కోట్లు క్లియర్ చేశాం. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా వడ్డీలకు అప్పులు తెచ్చింది. ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై భారీగా ఉన్న వడ్డీలను రీ షెడ్యూల్ చేసి తగ్గించుకోగలిగాం. ప్రస్తుతం సరాసరి 9.1 శాతం వడ్డీని ప్రభుత్వం అప్పులపై చెల్లిస్తోంది. ఈ భారాన్ని ఇంకా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నాం. విధ్వంసమైన వ్యవస్థలను నెమ్మదిగా గాడిన పెడుతున్నాం. గత పాలకులు ఉద్యోగులను దగ్గరకే రానీయలేదు. రివర్స్ పీఆర్సీ ఇచ్చారు... అలాంటి పరిస్థితులు ఉద్యోగులు మరిచిపోవద్దు. గత ప్రభుత్వం రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను కూడా పెండింగులో పెట్టింది. ఉద్యోగులను అవమానించేలా వాలంటరీలతో కరపత్రాలు పంపిణీ చేయించారు.. హోర్డింగులు పెట్టించారు. పేపర్లో ప్రకటనలు ఇచ్చారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మధ్యవర్తులతోనే మాట్లాడే పరిస్థితి నాడు ఉండేది. సమస్యల పరిష్కారం కోసం నాటి సీఎం కాళ్లు పట్టుకోవాలని అప్పుడు మంత్రులుగా ఉన్న వారు కామెంట్లు చేశారు... అవమానించారు. మంచికి చెడుకు ఉన్న వ్యత్యాసాన్ని ఉద్యోగులందరూ గుర్తించాలి. మేం ఉద్యోగులను గౌరవిస్తున్నాం... సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధితో ఉన్నాం. రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడకూడదని వారి సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యతనిచ్చాం. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ సానుకూలంగా ఉంటాం. ఆర్థిక వెసులుబాటు ఉంటే ఉద్యోగులకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. 2014లో నాడు విభజన తర్వాత ఉద్యోగుల సంక్షేమానికి పెద్ద పీట వేశాం. విభజనకు వ్యతిరేకంగా పోరాడింది ఉద్యోగులే. వారిని గౌరవించాలని.. ఇబ్బందులు వస్తాయని తెలిసినా... 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చాం. ఉద్యోగులు వారి సమస్యల గురించి.. యూనియన్ల కోసం పని చేస్తారు. నేను రాష్ట్రం కోసం... ప్రజల కోసం ఆలోచించాలి. ఇందులో ఉద్యోగులూ భాగమే."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**గత పాలకుల నిర్వాకం వల్ల పెళ్లిళ్లను వాయిదా వేసుకున్నాం:** ఉద్యోగులుఉద్యోగుల పెండింగ్ సమస్యలను.. డిమాండ్లను నెరవెరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ప్రకటనపై సమావేశానికి హాజరైన ఉద్యోగ సంఘాల నేతల హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల సానుకూలత కనబరిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వంలో పీఎఫ్ లోన్లను కూడా ఇవ్వకుండా వేధించడం వల్ల పెళ్లిళ్లను కూడా వాయిదా వేసుకున్న పరిస్థితులు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. రిటైర్మెంట్ ఉద్యోగులకు మేలు చేసేలా ఉన్న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను గత ప్రభుత్వం రద్దు చేసింది. దాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్దరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సును పెంచినందుకూ కృతజ్ఞతలు తెలియచేశారు. రాష్ట్రానికున్న ఆర్థిక ఇబ్బందులను తాము అర్థం చేసుకున్నామని... రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమ వైపు నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని ఉద్యోగులు వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

జరగాలన్న ఆలోచనతో తమ హయాంలోనే డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చాం.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం కూడా మెగా డీఎస్సీ ద్వారా టీచర్ల నియామకం చేపట్టాం. వైసీపీ నేతలు 350కి పైగా పిటిషన్లను వేసి నియామకాలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వాటన్నింటినీ దాటుకుని నియామకాలు పూర్తి చేసి ఉద్యోగాలు ఇచ్చాం.ఎక్కువ సమయం పాఠశాలలోనే విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యతలో టీచర్లు ఉంటారు. భవిష్యత్తును ఊహించి నిర్ణయాలు తీసుకోవటం వల్లే ఐటీ లాంటి విప్లవాన్ని అందిపుచ్చుకున్నాం.పాలనా సంస్కరణలు, టెక్నాలజీ వినియోగం లాంటి అంశాలే మన తెలుగు వారిని అగ్రస్థానంలో నిలబెట్టాయి. విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు వచ్చాయి. టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ ముందుకు సాగాల్సిందే నంటూ పిలుపునిచ్చారు.

**ఉద్యోగులు, టీచర్లకు శుభవార్త** ఉద్యోగులు, టీచర్లకు కూడా ఇవాళ ఓ శుభవార్త తెలియచేయాలని అనుకుంటున్నానని ఉపాధ్యాయ దినోత్సవం సభలో వ్యాఖ్యానించారు. 12వ పీఆర్సీ నియామకానికి అంగీకారం తెలియచేశామన్న ముఖ్యమంత్రి,రెండు డీఏల ను ఈ అక్టోబరు నుంచి ఇవ్వాలని నిర్ణయించామని చెప్పుకొచ్చారు. 2022 ఏడాది సరెండర్ లీవ్‌ను సంక్రాంతికి ఉద్యోగుల ఖాతాల్లో వేస్తామని తెలిపిన చంద్రబాబు?, పోలీసులకు ఈ దసరాకు అదనపు సరెండర్ లీవ్ ఇస్తున్నామని ప్రకటించారు.పెన్షనర్లకు అడిషనల్ క్వాంటం ఆప్ పెన్షన్‌ను 10-15 శాతం పెంచుతున్నామని తెలిపారు.ఎంప్లాయిస్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను కూడా ప్రతినెలా నిధులు జమ చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన సీఎం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా బాధ్యతగా ఉద్యోగులను కలుపుకుని వెళ్లాలనే నిర్ణయం తీసుకున్ననట్లు చెప్పారు. చంద్రబాబు ప్రకటనలతో కరతాళ ధ్వనులతో హర్షం వ్యక్తం చేసారు ఉపాధ్యాయులు.

# 264 ఎకరాల్లో భారీ ప్రాజెక్ట్...

(మొదటి పేజీ తరువాయి)

గరిష్ఠంగా 1 గిగావాట్ (జీడబ్ల్యూ) వరకు ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు ఉపయోగించుకునేలా దీన్ని ప్రత్యేకంగా రూపొందించనున్నారు. అధిక సామర్థ్యం ఉన్న కంప్యూటింగ్ సిస్టమ్స్‌ను నిర్వహించేందుకు లిక్విడ్-కూల్డ్ టెక్నాలజీతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ ప్రాజెక్ట్ వల్ల హైదరాబాద్ ప్రాంతంలో నేరుగా, పరోక్షంగా వేలాది ఉద్యోగాలు వస్తాయని హైపర్‌వాల్ట్ తెలిపింది. ఈ మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించేందుకు హైపర్‌వాల్ట్, దాని భాగస్వాములు కలిసి రూ.70,000 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నారు. కస్టమర్ల అవసరాలు, టెక్నాలజీలో వచ్చే మార్పులను బట్టి ఈ ప్రాజెక్ట్‌ను దశలవారీగా చేపట్టనున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రానికి, దేశానికి "చారిత్రాత్మకమైనది"గా అభివర్ణించారు. ఏఐ విప్లవంలో హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ స్థాయిలో ముందంజలో ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా ఏఐకి అవసరమైన మౌలిక సదుపాయాలపై హైదరాబాద్ దృష్టి పెడుతోందని చెప్పారు. "ఈ దశాబ్దం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ది. ఏఐ మోడల్స్, వాటిని నడిపించే కంప్యూటింగ్ సామర్థ్యం వేగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలుగా మారుతున్నాయి. ఈ కంప్యూటింగ్ సదుపాయం తెలంగాణలో ఉండటం మనకు ఒక అదనపు ప్రయోజనం" అని రేవంత్ రెడ్డి అన్నారు. డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణంలో గ్రీన్ ఎనర్జీని ఉపయోగించడంతో పాటు, నీటి వినియోగాన్ని సమతుల్యం చేసే డిజైన్ విధానాలను పాటించనున్నట్లు కంపెనీ తెలిపింది.టీసీఎస్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కె. కృతివాసన్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ తమ "ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-టు-ఇంటెలిజెన్స్" వ్యూహాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందని చెప్పారు. ఏఐకి సిద్ధంగా ఉండే మౌలిక సదుపాయాలను టీసీఎస్ క్లౌడ్, ఏఐ, ఎంటర్‌ప్రైజ్ సామర్థ్యాలతో కలిపి ఈ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. "ప్రపంచవ్యాప్తంగా ఉన్న కస్టమర్ల అవసరాలను తీర్చేందుకు హైదరాబాద్‌కు అవసరమైన స్థాయి, ప్రతిభ, టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయి" అని కృతివాసన్ అన్నారు. ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతోపాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి.దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ బి.అజిత్‌రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణాదిత్య, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

## - రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 05:**బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి తక్షణమే రాజీనామా చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలు నిర్వర్తించని వ్యక్తి ఆ పదవిలో కొనసాగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయమై ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద 'మహా ధర్నా' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాకు సంబంధించిన సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వందేళ్ల నష్టం వాటిల్లిందని విమర్శించారు. "వెయ్యి రోజులుగా ఎమ్మెల్యేగా వేతనం



తీసుకుంటున్న కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని, కనీసం తన నియోజకవర్గ ప్రజలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రతిపక్ష నేతగా ఆయన పూర్తిగా విఫలమయ్యారు" అని ఆరోపించారు. కేసీఆర్ వైఖరిని ప్రజల దృష్టికి తీసుకెళ్లడానికే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఇదే వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజాపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# 4 రాష్ట్రాల్లో జనగణన

(మొదటి పేజీ తరువాయి)

జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (RGI - రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# ఉక్రెయిన్‌పై దాడులకు విరామం.. పుతిన్ కీలక ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు పుతిన్ ఆదేశించారు. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. యుద్ధం ముగింపు కోసం చర్చలు జరిపే ఉద్దేశంతో అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లు మాస్కో చేరుకోవడంతో పుతిన్ తాజా ఆదేశాలిచ్చారు.

రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించేందుకు కొత్త, స్పష్టమైన ప్రతిపాదన తన వద్ద ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ చెప్పిన మరుసటి రోజే అమెరికా ప్రత్యేక ప్రతినిధుల మాస్కో పర్యటన చోటుచేసుకుంది.కాగా, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ సైతం చర్చల వేళ దాడులు చేసుకోవద్దని శుక్రవారంనాడు రష్యాకు ప్రతిపాదించారు. తమ వైపు నుంచి ఎలాంటి దాడులు ఉండవని, ప్రత్యర్థి నుంచి కూడా ఇదే ఆశిస్తున్నామని చెప్పారు. ఉక్రెయిన్, రష్యా మధ్య వైమానిక దాడులు పెరిగిన సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు జరుగుతుండటం విశేషం. శుక్రవారం కీవ్‌లోన ఉక్రెయిన్ భద్రతా సంస్థ ఎస్‌బీయూ ప్రధాన కార్యాలయంపై రష్యా డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత జరిగిన అత్యంత ప్రముఖ దాడుల్లో ఇది ఒకటిగా చెబుతున్నారు. రాత్రికి రాత్రి 167 డ్రోన్లను రష్యా ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

# రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటా : అయ్యన్నపాత్రుడు

(మొదటి పేజీ తరువాయి)

విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.అయ్యన్న అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల కాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. మరోవైపు రేపు నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే.. వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# ఏపీలో ప్రశ్నించే గొంతుకలను అణిచివేస్తున్న కూటమి సర్కార్

(మొదటి పేజీ తరువాయి)

మాధ్యమాలు విస్తృతంగా వాస్తవాలను ప్రచారం చేస్తుండగా వాటి అకౌంట్లను చంద్రబాబు బ్లాక్ చేయిస్తున్నారని ట్విటర్‌లో విమర్శించారు.నిజాన్ని వెలికితీసేందుకు సీబీఐ విచారణకు అంగీకరించడానికి బదులుగా, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న గొంతుకలను అణచి వేయాలని చూస్తుందని పేర్కొన్నారు. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ అనేవి భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కులని గుర్తు చేశారు. కేవలం వారి ప్రశ్నలు రాజకీయంగా ఇబ్బందికరంగా ఉన్నాయనే కారణంతో ప్రతిపక్షాలను, మీడియాను, కార్యకర్తలను , పౌరుల గొంతు నొక్కే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు.చంద్రబాబు నాయుడు, మీరు దేనికి భయపడుతున్నారు? ప్రశ్నలకా లేక సమాధానాలకా? డీఎస్సీ నియామకాలలో ప్రతిరోజూ వెలుగులోకి వస్తున్న ఆధారాలు అబద్ధమైతే, ప్రజల ముందుకు వచ్చి వాస్తవాలతో వాటిని తప్పు అని నిరూపించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షలు కూడా రాయకుండానే , టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ లో ఉత్తీర్ణత సాధించకుండానే ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చినప్పుడు మిమ్మల్ని మీరు ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. అవకతవకలకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# ఈనెల 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 05:** సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. ఈసారి అసెంబ్లీ సమావేశాలు హాట్ హాట్‌గా జరిగే అవకాశం ఉందని గుత్తా అన్నారు.సభకు సంబంధించిన అన్ని శాఖల అధికారులు సమావేశాల సమయంలో అందుబాటులో ఉండాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి? ఆదేశించారు. సభ్యులకు అందించే మెటీరియల్‌ను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో ముందుగానే అందించాలని సూచించారు. సభ లోపల, బయట ప్రశాంత వాతా వరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్, చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ధర్నాలు, రాస్తారో కోలు జరగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటెలిజెన్స్ సమాచారం వేగంగా అసెంబ్లీ అధికారులకు చేరేలా సమన్వయం చేయాలని ఆదేశించారు. సమావేశాల నిర్వహణ కోసం నోడల్ అధికారులను నియమించాలన్నారు.సభ్యుల ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలను ఒకరోజు ముందే అందించాలని అధికారులను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. ప్రతి శాఖ నుంచి ఒక అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. ఉభయ సభల సమావేశాలు ప్రభుత్వ కార్యనిర్వాహక వ్యవస్థ సమర్థతకు నిదర్శనమని శ్రీధర్ బాబు అన్నారు. ప్రభుత్వం తరఫున సమావేశాలకు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు. ఈ వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు ప్రవేశపెట్టడంతో పాటు, ప్రజలు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలపై సుదీర్ఘంగా చర్చించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు, ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు విపక్షాలు కూడా సిద్ధమవుతున్నాయి. దీంతో ఈసారి వర్షాకాల సమావేశాలు వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. వర్షాకాల సమావేశాలు ఎన్ని రోజుల పాటు కొనసాగుతాయనేది బిజినెస్ అడ్వైజరీ కమిటీ-బీఏసీ సమావేశంలో నిర్ణయించనున్నారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు వార్తలు
ఆదివారం, 06 సెప్టెంబర్ 2026



# విలువలతో కూడిన సమాజం నెలకొల్పడమే ధ్యేయం కావాలి

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విలువలతో కూడిన సమాజం నెలకొల్పడమే ధ్యేయం కావాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ దినోత్సవం – 2026 కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు విలువలు అందించాలన్నారు. ఇది సమాజానికి గొప్ప పెట్టుబడి కాగలదని పేర్కొన్నారు. విలువలు అనే పునాదిపై సమాజాన్ని నిర్మించాలని కోరారు. ఇది ఉపాధ్యాయుల చేతిలో ఉందని చెప్పారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, మంచి సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలలో ఉంటారని, వారిని చక్కగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమన్నారు. మంచి నాయకత్వ లక్షణాలు అందించాలన్నారు. విద్యార్థులు అనుకున్నది సాధించే వరకు కృషి చేసే విధంగా ప్రేరణ కల్పించాలన్నారు. ఒత్తిడిని తట్టుకునే శక్తి కలిగి ఉండే విధంగా విద్యార్థిని తయారు చేయాలని సూచించారు. ఓటమిని తట్టుకుని నిలబడే శక్తిని కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులను ఆశయాలకు దగ్గర చేయగలగాలన్నారు. మహాత్మా గాంధీ యావత్తు దేశాన్ని మమేకం చేశారన్నారు. భావితరాలకు ఏం కావాలో ఆలోచించండి. అందుకు అవసరమైన మెట్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఆచార్యుడిగా, గొప్ప ఫిలాసఫర్ గా నిలిచారని, అందుకు రాధాకృష్ణన్ అనుసరించిన విలువలు, ఆచరణ మాత్రమేనని అన్నారు. విద్యార్థులు సాధించిన దానిని తానే సాధించినట్లు గురువు భావిస్తే గొప్ప విషయాలకు శ్రీకారం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులుగా ఎంతో మందికి బోధన చేశారు. ఎంతో మందికి మార్గదర్శకత్వం చేశారని చెప్పగలిగితే,దానికి సరితూగేది ఏదీ లేదన్నారు. ప్రతి అడుగులో గురువు చూపే దారి గొప్పదన్నారు. విద్యార్థులు ఏమి సాధించాలి అని మార్గదర్శకత్వం వహించేది గురువేనన్నారు. గురువు స్థానంలో ఉన్న మీపై ఎక్కువ బాధ్యత ఉందన్నారు. శ్రద్ధతో ఇష్టంతో విద్యా బోధన చేయడంతో పదవ తరగతి మంచి ఫలితాలు వచ్చాయన్నారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు, కష్టపడి పనిచేసే వారు ఉన్నారని కితాబు ఇచ్చారు. అయితే మార్కులు వరకే పరిమితం కాకూడదన్నారు. ప్రస్తుతం సాంకేతిక విప్లవంతో సమాచారం అందుబాటులో ఉందని, కానీ విద్యార్థులకు విశ్లేషణ చేసే శక్తి అవసరం అన్నారు. విశ్లేషణ శక్తి కల్పించాలని సూచించారు. విద్యార్థులను గమనించాలని, వారికి అవసరమగు నైపుణ్యం అందించాలని, జీవితంలో చక్కగా స్థిర పడటమే కాకుండా సమాజానికి విలువైన సంపదగా తయారు చేయాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ భీమనేని వందనా దేవి మాట్లాడుతూ, సమాజానికి అత్యుత్తమ అత్యున్నత, పౌరులను అందించాలన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గొప్ప ఉపాధ్యాయుడుగా పేరెన్నిక గన్నారన్నారు. గురువు లేనిదే రాణింపు లేదన్నారు. ఏ రంగంలో ఉన్న వ్యక్తినైనా ఉపాధ్యాయుడే తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వర రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న పవిత్రమైన వృత్తిలో ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పదని చెప్పారు. వివిధ విద్యా సంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్షా అభియాన్ ఎపిసి పద్మావతి, ఉప విద్యా శాఖ అధికారులు ఏసు రత్నం, శాంత కుమారి, మండల విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిఎంసి వార్డుల పునర్విభజన ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల

**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 57 వార్డులను 76 వార్డులుగా పునర్విభజిస్తూ శనివారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన (జి.ఓ.ఎం.ఎస్. నెం.65, ఎం.ఎ.డయు.డి., తేదీ 24-03-2026) మేరకు గుంటూరు నగరంలో వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పునర్విభజనలో భాగంగా 76 ప్రతిపాదిత వార్డుల ముసాయిదా సరిహద్దుల వివరాలను ఫారం-I లో సెప్టెంబర్ 5 నుంచి ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ వివరాలను జిఎంసి ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాలు మరియు ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. వార్డుల పునర్విభజన, ముసాయిదా సరిహద్దులకు సంబంధించి ప్రజలకు ఏవైనా సూచనలు లేదా అభ్యంతరాలు ఉంటే, సెప్టెంబర్ 11 లోపు గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో సమర్పించాలని కోరారు. ప్రజల నుంచి వచ్చే సూచనలు, అభ్యంతరాలను సెప్టెంబర్ 12 సిడిఎంఏకి పంపుతామని, సిడిఎంఏ 13వ తేదీన తుది వార్డ్ లను ఖరారు చేసి, 14వ తేదీన ఏపి గెజిట్ ఫారం- VI లో తుది నోటిఫికేషన్ ప్రచురిస్తారని తెలిపారు.

# చేబ్రోలు బ్రిడ్జికి మరమ్మతులు.. నూతన బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు



కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రమాదానికి గురై, రైలింగ్ దెబ్బతిని, ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితిలో ఉన్న చేబ్రోలు బ్రిడ్జిని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. నియోజకవర్గ పర్యటనలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌తో కలిసి బ్రిడ్జి పరిస్థితిని ఆయన స్వయంగా పరిశీలించారు. ఇటీవల జరిగిన లారీ ప్రమాదం కారణంగా బ్రిడ్జి రైలింగ్ దెబ్బతినడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని మంత్రి పరిశీలించారు. బ్రిడ్జి వద్ద ఉన్న ప్రమాదకర పరిస్థితులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ బ్రిడ్జికి అవసరమైన మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయిస్తామని మంత్రి పెమ్మసాని తెలిపారు. అదేవిదంగా దీర్ఘకాలికంగా ప్రజలకు ఉపయోగపడేలా నూతన బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ప్రమాదాలకు తావులేని విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కేంద్ర మంత్రి ఆదేశించారు. చేబ్రోలు బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# పర్యావరణ హిత 'గ్రీన్ గణేష్' విగ్రహాలతో వినాయక చవితి వేడుకలు జరుపుకుందాం



కమిషనర్ కె.మయూర్ అశోక్

**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, కాలుష్య రహితంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 11వ తేదీన నగరంలో సుమారు 25 వేల మంది విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యాశాఖ, జిఎంసి అధికారులతో "ఎకో ఫ్రెండ్లీ వినాయక చవితి" వేడుకల నిర్వహణపై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పూర్వకాలంలో పండుగలను పర్యావరణానికి, ప్రజారోగ్యానికి మేలు చేసే రీతిలో జరుపుకునేవారమన్నారు. కానీ ప్రస్తుతం ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ప్రమాదకరమైన రసాయన రంగులతో తయారుచేసిన విగ్రహాలను ఉపయోగించడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజలు అనేక అనారోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి జిఎంసి తరఫున మొదటి అడుగుగా విద్యార్థుల ద్వారా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించి, వారిలో పర్యావరణం పట్ల ఆసక్తి పెంపొందేలా కృషి చేయాలని నిర్ణయించామన్నారు. ఇందులో భాగంగా నగరంలోని ప్రతి విద్యాసంస్థకు వివిధ రకాల మొక్కల విత్తనాలు కలిపిన నాణ్యమైన మట్టిని అందజేసి, విద్యార్థులు వినాయక ప్రతిమలు చేసేలా ప్రోత్సహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికీ ప్రత్యేక పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. అంతేకాకుండా, పాఠశాలల వారీగా కొంతమంది విద్యార్థులను 'గ్రీన్ అంబాసిడర్లు'గా నియమించి, వారికి జిఎంసి నుండి ప్రత్యేకమైన బ్యాడ్జీలను అందజేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, శాంతి కళ, సురేష్ బాబు, ఎస్ఈ సుందరరామిరెడ్డి, పాల్గొన్నారు.

# మహిళను బెదిరించి అత్యాచారం చేసిన నిందితుడు అరెస్ట్



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** మహిళను కత్తితో బెదిరించి, అత్యాచారానికి ఒడిగట్టిన వ్యక్తిని నల్లపాడు పోలీసులు అరెస్ట్ చేశారు. తాడికొండ మండలం, తాతిరెడ్డిపాలెంకి చెందిన గణేశ్, గుంటూరు కన్నావారితోటకు చెందిన ఓ మహిళను గత నెల 14న కత్తితో బెదిరించి కారులో ఎక్కించుకొని వెళ్ళి లాం సమీపంలో అత్యాచారం చేశాడు. వీడియోలు తీసి, తాను పిలిచినప్పుడల్లా రావాలని లేకుంటే వీడియోలు భయటపెడతానని బెదిరించాడు. మహిళ ఫిర్యాదుతో నిందితుడ్ని అరెస్ట్ చేశారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని బాధితులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే పోలీసులు ఆశ్రయించాలని నల్లపాడు పోలీసులు సూచించారు.

# నూతన హెడ్ కానిస్టేబుళ్లను అభినందించిన జిల్లా ఎస్పీ



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పల్నాడు జిల్లాలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది, బదిలీపై గుంటూరు జిల్లాకు వచ్చిన 9 మంది నూతన హెడ్ కానిస్టేబుళ్లు శనివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నూతన హెడ్ కానిస్టేబుళ్లను అభినందించి, పదోన్నతికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కష్టపడి, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, నిజాయితీ మరియు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

# ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ ని ఆదర్శంగా తీసుకోవాలి : డిఇఓ



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శంగా తీసుకోవాలని గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాష అన్నారు. గుంటూరు పాత బస్టాండ్ కూడలిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గల సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వలన ఏ వృత్తిలో ఉన్న వారికి లేని గౌరవం ఉపాధ్యాయ వృత్తి కి ఉన్నదన్నారు. అందువలన ఉపాధ్యాయులు ఉన్నత ఆశయంతో వారి ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఈ బి సెక్రటరీ కె. విజయభాస్కర్, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం, మంగళగిరి మండల విద్యాశాఖ అధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు

## డేగల ప్రభాకర్ జన్మదినోత్సవం సందర్భంగా యువత స్వచ్ఛంద రక్తదానం



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) చైర్మన్ డేగల ప్రభాకర్ జన్మదినోత్సవ వేడుకలు గుంటూరులో సేవా కార్యక్రమాలతో ఘనంగా జరిగాయి. జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు పరిమితం చేయకుండా ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలుగా నిర్వహించాలనే ఉద్దేశంతో మెగా రక్తదాన శిబిరంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. గుంటూరులోని ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి యువత నుంచి విశేష స్పందన లభించింది. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం అందేలా చేయడం, యువతలో రక్తదానంపై అవగాహన కల్పించడం, సామాజిక బాధ్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

**జీజీహెచ్‌లో మహిళలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ :** జన్మదినోత్సవంలో భాగంగా గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లోని స్త్రీ ప్రసూతి విభాగాన్ని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న మహిళలకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రోగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్నవారు తమ వ్యక్తిగత వేడుకలను కూడా ప్రజా సేవకు ఉపయోగపడే విధంగా నిర్వహించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఆత్మీయత, భరోసా కల్పించడం, అవసరమైన వారికి సహాయం అందించడం సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీఐడీసీ చైర్మన్‌గా పారిశ్రామిక అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డేగల ప్రభాకర్ పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం కల్పించడం, పెట్టుబడిదారులను ప్రోత్సహించడం, పారిశ్రామిక మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా ఏపీఐడీసీ ద్వారా మరింత చురుకైన పాత్ర పోషిస్తామని అన్నారు. "జన్మదిన వేడుకలు కేవలం సంబరాలకు పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఉండాలన్నదే నా అభిమతం. రక్తదానం ఒక గొప్ప మానవతా సేవ. మనం ఇచ్చే రక్తం అత్యవసర సమయంలో మరొకరి ప్రాణాలను కాపాడుతుంది. నా జన్మదినం సందర్భంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ఎంతో సంతోషంగా ఉంది" అని డేగల ప్రభాకర్ అన్నారు. అనంతరం పార్టీ శ్రేణులు, అభిమానులు డేగల ప్రభాకర్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఒకవైపు యువతతో మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం, మరోవైపు జీజీహెచ్ ప్రసూతి విభాగంలోని మహిళలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేయడం ద్వారా డేగల ప్రభాకర్ జన్మదిన వేడుకలు సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచాయి.

# రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి

రీ-సర్వే తో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
రాష్ట్ర సర్వే, సెటిల్మెంట్ మరియు ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణశీకి కుర్మనాధ్
రీసర్వే ఆకస్మిక తనిఖీలో సూచనలు చేస్తున్న రాష్ట్ర సర్వే సెటిల్మెంట్ అండ్ లాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్



**ఇబ్రహీంపట్నం, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్** : భూముల్లో నిర్వహిస్తున్న రీసర్వేల్లో రైతులను భాగస్వాములను చేసేలా ముందుగానే సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని, ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేయాలని రాష్ట్రసర్వే, సెటిల్మెంట్అండ్ లాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అన్నారు. శనివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే కార్యక్రమాన్ని ఆయన జిల్లా రెవిన్యూ, సర్వే అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమక్షంలో సర్వే జరగడంతో అయన హర్షం వ్యక్తం చేశారు. రీసర్వే లో తప్పులు పునరావృతం కాకుండా పారదర్శకత ఉండేందుకు రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సర్వే మొదలు పెట్టేరోజున తప్పనిసరిగా సంబంధిత రైతు లేదా కుటుంబసభ్యులు క్షేత్ర స్థాయిలో ఉండాలని, సర్వే పూర్తయిన తరువాత డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా సరిహద్దుల నిర్ణయం రైతు సమక్షంలోనే నిర్వహించాలన్నారు. రైతు చేతికి సరైన కొలతలతో కూడిన పట్టాదారు పాసుపుస్తకం అందజేసే వరకూ సమాచారం తప్పనిసరిగా అందించేలా చూడాలని జిల్లా సర్వే అధికారి వై మోహన్ రావు ను ఆదేశించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కుర్మనాధ్ మాట్లాడుతూ. ప్రస్తుతం రాష్ట్రా వ్యాప్తంగా జరుగుతున్నా రీసర్వే లో తప్పులు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో భూ సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించే విధంగా రీసర్వే 2.0 నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వే నిర్వహించిన తరువాత నోటీసు రూపంలో రైతు చూపించిన భూ హద్దుల ప్రకారం భూ వివరాలను తెలియజేయడం, డాక్యుమెంట్లతో సరిపోల్చుకుని నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కేవైసీ చేయించడం ద్వారా రైతు సమక్షంలో సర్వే నిర్వహించడంతో పాటు రైతులకు అన్ని విధాలా సమాచారం అందిస్తూ ఎక్కడా రైతులు ఇబ్బంది పడకుండా చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వ హిస్తున్న రీసర్వేల్లో ఫేజ్-1లో 628, ఫేజ్-2 లో 748, ఫేజ్-3 లో 729, ఫేజ్-4 లో 1645 గ్రామాల్లో నిర్వహిస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 2,800 బృందలతో అత్యాధునిక రోవర్స్ తో సర్వే నిర్వహించడం జరుగుతున్నదన్నారు. క్షేత్ర స్థాయిలో భూవివరాలు, డాక్యుమెంట్ పరంగా గల వివరాలను రైతుల సమక్షంలోనే సరిపోల్చుతూ ఇకముందు ఎటు వంటి భూ వివాదాలకు తావులేకుండా రైతులు సంతృప్తి చెందే విధంగా రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఫేజ్-5 లో రాష్ట్ర వ్యాప్తంగా 1, 343 గ్రామాలలో రైతులతో కలిసిమెలిసి క్షేత్రస్థాయిలో రీసర్వే నిర్వహిస్తున్నామన్నామని, రైతులు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్య క్రమంలో జిల్లా సర్వే అధికారి వై మోహన్ రావు,తహసీల్దార్ రిబ్ కా, గుంటుపల్లి గ్రామ సర్వేయర్లు దత్త, శ్యామ్ సన్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల 18వ వార్డులో పల్లెనిద్ర కార్యక్రమం

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**బాపట్ల, 05సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు స్థానిక ఇబ్బందులను పరిష్కరించేందుకు బాపట్ల పట్టణ పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని 18వ వార్డులో 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్లపట్టణ ఎస్సై విజయ్ కుమార్, వార్డు ఇన్చార్జి చేజర్ల సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వార్డులోని స్థానికులతో ముఖాముఖి నిర్వహించిన ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అసాంఘిక కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. వార్డు ఇన్చార్జి చేజర్ల సతీష్ మాట్లాడుతూ, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పోలీసు అధికారులు తమ వద్దకు వచ్చి రాత్రి బస చేస్తూ సమస్యలు వినడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వీఎంసీలో డీజిల్ దోపిడీకి అడ్డూ అదుపు లేదా ?

సింగ్నగర్ రైతుబజార్ కేంద్రంగా అక్రమాల ఆరోపణలు
కదలని వాహనానికి రోజూ 36 లీటర్ల డీజిల్ ఎలా?
లాగ్బుక్లలో మాయాజాలమా..
అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు



**విజయవాడ, 05 సెప్టెంబర్ 2026, భారత ప్రతినిధి న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ)లో ప్రజాధనం దుర్వినియోగంపై మరోసారి ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సింగ్ నగర్ రైతుబజార్ పరిసరాలను కేంద్రంగా చేసుకుని మున్సిపల్ వాహనాలకు కేటాయించే డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధుల్లో భాగంగా క్షేత్ర స్థాయిలో తిరగాల్సిన ఓ వాహనం చాలాకాలంగా ఒకేచోటే నిలిచి ఉంటున్నప్పటికీ, రికార్డుల్లో మాత్రం వాహనం తిరిగినట్లు కిలో మీటర్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. రోజుకు సుమారు 36 లీటర్ల డీజిల్ కేటాయింపు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉండగా, అందులో కొంత ఇంధనం వాహనంలో వినియోగించకుండా క్యాన్లలోకి తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**కదలని వాహనానికి ఇంత డీజిల్ ఎలా ?**

వాహనం వాస్తవంగా క్షేత్రస్థాయిలో తిరగకపోతే రోజువారీగా ఇంత భారీ మొత్తంలో డీజిల్ ఎలా ఖర్చవుతోంది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాహనం కిలోమీటర్ రీడింగ్, లాగ్బుక్, డీజిల్ జారీ రిజిస్టర్లు, బిల్లులు, వినియోగ వివరాలు సమగ్రంగా పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఒక్కరి పని కాదు.. అండ ఎవరిది?**

డీజిల్ వినియోగంలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు నిజమైతే, అది కేవలం డ్రైవర్ స్థాయిలోనే సాధ్యమయ్యే వ్యవ హారమా? లేక సంబంధిత సిబ్బంది, పర్యవేక్షణాధికారుల పాత్ర కూడా ఉందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాహనాల నిర్వహణ, లాగ్బుక్ల పరిశీలన, ఇంధన వినియోగంపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఇంతకాలం ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**సీసీ కెమెరాలే అసలు సాక్ష్యాలా?**

సింగ్నగర్ రైతుబజార్ పరిసరాల్లో ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తే వాహనం వాస్తవంగా ఎక్కడ తిరిగింది, ఎంతసేపు అక్కడ నిలిచింది వంటి అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. డీజిల్ ను క్యాన్లలోకి తరలించారనే ఆరోపణలపైనా ఫుటేజీ ద్వారా నిజా నిజాలు తేలే అవకాశం ఉంది. అందువల్ల గత కొన్ని నెలలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, వాహన లాగ్బుక్లు, కిలోమీటర్ రీడింగ్లు, డీజిల్ బిల్లులు, ఇంధన జారీ రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకుని సమగ్రంగా పరిశీలించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**ప్రజాధనంపై ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనం?**

ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న వీఎంసీ.. నగరంలో అనేక మౌలిక వసతులకు నిధుల కొరత ఉందని చెబుతున్న సమయంలో, ఇంధన వినియోగంపై ఇలాంటి ఆరోపణలు రావడం విమర్శలకు తావిస్తోంది. ఆరోపణల్లో వాస్తవం ఉంటే ప్రజాధనానికి నష్టం కలిగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. డీజిల్ వినియోగంపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, వాహనాల లాగ్బుక్లు, కిలోమీటర్ రీడింగ్లు, డీజిల్ బిల్లులు, జారీ రిజిస్టర్లు, సీసీటీవీ ఫుటేజీలను పరస్పరం సరిపోల్చి విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రజాధనానికి జరిగిన నష్టాన్ని రికవరీ చేయాలని కోరుతున్నారు.

# ఆపరేషన్ వజ్రప్రహార్లో కార్డన్ అండ్ సెర్చ్

కొత్తవలస 202 కాలనీలో
100 ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు





**కొత్తవలస, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు 'ఆపరేషన్ వజ్రప్రహార్'లో భాగంగా కొత్తవలస పోలీస్ స్టేషన్ పరిధిలోని 202 కాలనీలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ నిర్వహించారు. కొత్తవలస సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది, ఈగల్ టీం సభ్యులు బృందాలుగా ఏర్పడి కాలనీలోని సుమారు 100 ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించడంతో పాటు వారి వేలిముద్రలను ఎం.ఎస్.సీ.డి. పరికరాల ద్వారా పరిశీలించి ఒక అనుమానిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాల రికార్డులను కూడా తనిఖీ చేయగా, సరైన పత్రాలు లేని రెండు ద్విచక్ర వాహనాలను తదుపరి చర్యల నిమిత్తం పోలీస్ స్టేషన్కు తరలించారు. అనుమానితులు తప్పించుకునే అవకాశం ఉన్న మార్గాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాలను పోలీసు బృందాలతో దిగ్బంధించారు. ఈ తనిఖీల్లో ఎలాంటి నిషేధిత వస్తువులు, గంజాయి, నాటుసారా వంటివి లభించలేదని పోలీసులు తెలిపారు. కాలనీలో సస్పెక్ట్ షీట్ ఉన్న వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని సీఐ విజయ్కుమార్ తెలిపారు. తనిఖీల అనంతరం కాలనీ ప్రజలతో సమావేశమైన సీఐ విజయ్కుమార్.. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, రహదారి భద్రత, మహిళల రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 1972, డయల్ 100/112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. అనంతరం యువత, ప్రజలతో యాంటీ డ్రగ్స్పై ప్రతిజ్ఞ చేయించి, గంజాయి వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు.

# దేశ భవిష్యత్తు.. తరగతి గదిలో నిర్మించబడుతుంది



**బాపట్ల, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మించబడుతుందని కర్లపాలెం మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఆ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తొలిత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి, ఆ పాఠ శాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులందరినీ విద్యార్థినీ విద్యార్థులు సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇన కొల్లు పోలీసురావు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయికి వెళ్లిన గొప్ప విద్యావేత్త ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె విమలమ్మ, బుర్ల రాజేష్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు,

# గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**కొత్తవలస, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5న కొత్తవలసలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. విద్యార్థులు తమ గురువులకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉపాధ్యాయుల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రిన్సిపల్ కే పూర్ణ మరియు కరెస్పాండెంట్ కే కే.రమేష్. బి నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తమకు నిజమైన సంతృప్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల త్యాగాలు మరువలేనివి



బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి, ప్రఖ్యాత తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని సాయి గార్డెన్స్ కన్వెన్షన్ హాల్లో గురు పూజోత్సవం (ఉపాధ్యాయ దినోత్సవం) వేడుకలో ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మరియు చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య పాల్గొని విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించి, దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహనీయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్" అని కొనియాడారు. ఆయన పుట్టినరోజును ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు. సమాజంలో విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్ద డంలో ఉపాధ్యాయులదే ప్రధాన పాత్ర అని, ఒక మంచి సమాజ నిర్మాణానికి పునాది గురువులేనని కొనియాడారు. కేవలం పాఠ్యపుస్తకాల బోధనే కాకుండా, విద్యార్థులలో నైతిక విలువలు, దేశభక్తి, సేవా భావాన్ని పెంపొందించే బాధ్యత గురువులపైనే ఉందని పేర్కొన్నారు. కేవలం మార్కులు, డిగ్రీలే కాకుండా విద్యార్థులలో మానవతా విలువలు, దేశభక్తి, బాధ్యతాయుత భావాలను నూరిపోసే మహోన్నత బాధ్యత గురువులదేనని నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.

# పరారీలో ఉన్న నిందితుడు గంగవరపు కేశవ అరెస్ట్

**కొత్తవలస, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతింధి న్యూస్ :** కొత్తవలస పోలీస్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో మంగళ పాలెం, శివాలయం, ఈ సంవత్సరం జనవరి నెలలో కొత్తవలస జంక్షన్, దుర్గ దేవి గుడిలో మరియు మార్చి నెలలో కుమ్మరి వీధి లో జరిగిన దొంగతనం కేసులలో పరారీలో ఉన్న నిందితుడు గంగవరపు కేశవ ం/శీ రమణ, వయస్సు 27 సం., కుమ్మరి కులం, కుమ్మరి వీధి, కొత్తవలస గ్రామం మరియు మండలం అను వ్యక్తిని కొత్తవలస సిఐ టివి విజయ కుమార్ శనివారం కొత్తవలస రైల్వే స్టేషన్ ఎదురుగా అదుపులోనికి తీసుకుని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి క్రైమ్ నెంబర్ 33/2026 (కుమ్మర వీధి కేసులో) లో ఒక బంగారపు చేతి ఉంగరముని రికవరీ చేసి, రిమాండ్ నిమిత్తం కొత్తవలస జేఎఫ్సిఎం కోర్టు ముందు హాజరుపరచారు.



# బాసర కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా గురుపూజోత్సవం



**నల్లపాడు/గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నల్లపాడులోని బాసర కాన్సెప్ట్ స్కూల్ నందు సెప్టెంబర్ 5న భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురుపూజా మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ నూతలపాటి అరవింద్, మానవీయత ఫౌండేషన్ డైరెక్టర్ సాంబశివరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.

**సాంకేతికత గురువుకు ప్రత్యామ్నాయం కాదు :** చైర్మన్ మురళీ మోహన్ రావు పాఠశాల చైర్మన్ సాదినేని మురళీమోహన్ రావు మాట్లాడుతూ గురుశిష్యుల పవిత్ర బంధాన్ని స్మరించుకునే మహత్తర దినం ఉపాధ్యాయుల దినోత్సవమని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినప్పటికీ, ఒక గురువు అందించే ఆత్మీయ ప్రోత్సాహం, నైతిక విలువలను ఏడిజిటల్ స్క్రీన్ కూడా భర్తీ చేయలేదని స్పష్టం చేశారు.

**మార్కులే విద్య కాదు, సామాజిక బాధ్యతే ముఖ్యం :** డైరెక్టర్ రాధ పాఠశాల డైరెక్టర్ సాదినేని రాధా మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శప్రాయమైన జీవితం నేటి విద్యార్థులకు మార్గదర్శకమని తెలిపారు. విద్యావంతులు కావడం అంటే కేవలం పరీక్షల్లో మార్కులు సాధించడం కాదని, సమాజం పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించడమే అసలైన విద్య అని విద్యార్థులకు హితవు పలికారు. ?అనంతరం విద్యార్థుల భవిష్యత్తుకు మార్గనిర్దేశనం చేస్తూ విశేష సేవలందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యా యులను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో విద్యా సంస్కరణలు : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయ సాధనలో పయనిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు విద్యను చేరువ చేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విజ్ఞాన వారధులని తెలిపారు. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దడంతో గురువుల పాత్ర కీలకమని చెప్పారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ద్వారా పని చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మెగా డీఎస్సీ పేరిట దగా డీఎస్సీ నిర్వహిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేలకుపైగా పోస్టులతో డీఎస్సీ నిర్వహిస్తే దీనిపైనా అభాండాలు వేస్తున్నారని మండిపడ్డారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తూ ఉత్తమ విద్యా విధానాలు తీసుకురావడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు ఉచితంగా విద్యా కిట్లు అందజేత వంటి కార్యక్రమాలతో విద్యార్థులకు తోడుగా నిలుస్తున్నారన్నారు. విద్యార్థులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పుస్తకాల్లోని పాఠశాలతోపాటు జీవితాన్ని మార్చే గొప్ప మార్గదర్శకులు గురువులని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్యే రూపుదిద్దుకుంటుందన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే గురువులను ఎప్పుడూ మరిచిపోకూడదని చెప్పారు. గురువుల పట్ల గౌరవం, విధేయత కలిగి ఉండటమే మనం వారికి ఇచ్చే నిజమైన గురుదక్షిణ అని తెలియజేశారు.

# 'మన ఊరు-మన జెండా' కార్యక్రమంలో బీజేపీ జెండా ఆవిష్కరణ



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 4వ మండలం అరండల్ పేట 7/1 నందు 'మన ఊరు-మన జెండా' కార్యక్రమాన్ని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ రామకృష్ణ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు వక్కలగడ్డ తిరుమలరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు జిల్లా ఇన్చార్జి యాళ్ళ దొరబాబు విచ్చేసి ముందుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు జిల్లా ఇన్చార్జి యాళ్ళ దొరబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం, మండలంలో బీజేపీ జెండా ఎగురవేసే కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతి జెండా స్థంభానికి డిజిటల్ జియో ట్యాగ్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, స్థానిక అభివృద్ధి అవసరాలు, పార్టీ నాయకుల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవిధానం ద్వారా ప్రజలకు సమాచారాన్ని సులభంగా చేరవేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ మండల అధ్యక్షుడు వక్కలగడ్డ తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలపాటి రవికుమార్, జాతీయ స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ కెవి సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, ఓబీసీ మచ్చ రాష్ట్ర కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, క్రిష్టిపాటి నారాయణరెడ్డి, మంత్రి సుగుణ, ధారా అంబేద్కర్, పెమ్మరాజు సుధాకర్, పెద్దింటి కృష్ణ చైతన్య, రమాదేవి, కిరణ్, గురు దేవరాయులు, కేశానుపల్లి శ్రీరామ్, మనోహర్, ఆదినారాయణ, షణ్ముఖం, లక్ష్మి తిరుపతమ్మ, చేగు నాగేశ్వరావు, పూర్ణ చంద్రరావు, శనత్, ధనుంజయ్, అవంతిస్, గోకుల్, దీన దయాలుడు, మంగళగిరి శ్రీనివాస్, కంతేటి బ్రహ్మయ్య, అనుమోలు ఏడుకొండలుగౌడ్, రాచుమల్లు భాస్కర్, ఈమని మాధవరెడ్డి, జితేంద్ర గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ అంధ క్రికెటర్లకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల ఆరోగ్య బీమా











పాలసీలను అందజేసిన
ఏసిఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని),
కార్యదర్శి సానా సతీష్ బాబు
దివ్యాంగ క్రికెటర్లను సాధారణ క్రికెటర్లతో
సమానంగా ప్రోత్సహిస్తాం: ఏసిఏ
ఇంగ్లండ్, శ్రీలంకల్లో రాణించిన డెఫ్ క్రికెటర్లకు
ఘన సన్మానం

**విజయవాడ, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** భారతదేశం తరఫున అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహిస్తూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్న అంధ క్రికెటర్ల భద్రత, ఆరోగ్యం మరియు సంక్షేమం కోసం ఒక విశేషమైన కార్యక్రమం విజయవాడలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ) కార్యాలయంలో జరిగింది. క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (CA BAP - CABI అనుబంధ సంస్థ), డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (DCCAP) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ స్థాయిలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఐదుగురు అంధ క్రికెటర్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా కవరేజ్ కలిగిన పాలసీలను అందజేశారు. ఈ బీమా పాలసీలను ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రధాన కార్యదర్శి సానా సతీష్ బాబు క్రీడాకారులకు స్వయంగా అందజేశారు.

**దివ్యాంగ క్రికెటర్లకు సమాన ప్రోత్సాహం : కేశినేని శివనాథ్ (చిన్ని)**
దివ్యాంగ క్రీడాకారులు తమ ప్రతిభతో దేశానికి, రాష్ట్రానికి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. "సాధారణ క్రికెటర్లతో సమానంగా దివ్యాంగ క్రికెటర్లను కూడా గౌరవిస్తూ, వారి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుంది. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులకు భద్రత, ప్రోత్సాహం కల్పించడం మా బాధ్యతగా భావిస్తున్నాం" అని ఆయన తెలిపారు.

**దివ్యాంగ క్రికెటర్లకు బాజూ పూర్తి సహకారం : సానా సతీష్ బాబు**
ఆంధ్రప్రదేశ్‌లో దివ్యాంగ క్రికెట్ అభివృద్ధికి ACA అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. "క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, అవసరమైన వసతులు, ప్రోత్సాహం మరియు భద్రత కల్పించడమే మా లక్ష్యం. దివ్యాంగ క్రికెటర్లు అంతర్జాతీయ స్థాయిలో మరింతగా రాణించేలా ఏసిఏ తన వంతు సహకారాన్ని కొనసాగిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

**అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి చొరవ**
ఈ ఆరోగ్య బీమా పాలసీల ఏర్పాటుకు ముఖ్య ప్రేరణగా నిలిచిన భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, అర్జున అవార్డు గ్రహీత ఇ. అజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, క్రీడాకారుల ఆరోగ్య భద్రత ఎంతో ముఖ్యమని అన్నారు. "నేను భారత జట్టు తరఫున ఆడుతున్న సమయంలో పలుమార్లు తీవ్ర గాయాలకు గురయ్యాను. ఆ సమయంలో సరైన ఆరోగ్య బీమా లేకపోవడంతో చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. నా లాంటి పరిస్థితి మరే అంధ క్రికెటర్‌కు రాకూడదనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న మన ఐదుగురు అంధ క్రికెటర్లకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించేందుకు ముందుకొచ్చాను" అని అజయ్ కుమార్ రెడ్డి తెలిపారు.

**బీమా పాలసీలు అందుకున్న ఐదుగురు అంతర్జాతీయ అంధ క్రికెటర్లు**

1. దుర్గారావు – ప్రస్తుత భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్
2. వెంకటేష్ – అంతర్జాతీయ అంధ క్రికెటర్
3. రవి – అంతర్జాతీయ అంధ క్రికెటర్
4. దున్న వెంకటేశ్వరరావు – అంతర్జాతీయ అంధ క్రికెటర్
5. కుమారి సత్యవతి – అంతర్జాతీయ అంధ క్రికెటర్

**అంతర్జాతీయ స్థాయిలో రాణించిన డెఫ్ క్రికెటర్లకు ఘన సన్మానం**
ఇటీవల ఇంగ్లండ్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన మిక్స్‌డ్ డిజేబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని దేశానికి గుర్తింపు తీసుకువచ్చిన డెఫ్ క్రికెటర్ యశ్వంత్ నాయుడును, అలాగే శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ డెఫ్ అండ్ డంబ్ ఉమెన్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన కుమారి జోష్నా రెడ్డిని ఏసిఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), ప్రధాన కార్యదర్శి సానా సతీష్ బాబు ఘనంగా సన్మానించారు. వీరిని శాలువాలతో సత్కరించి, అంతర్జాతీయ స్థాయిలో వారి ప్రతిభను అభినందించారు.

**ACAకు CABAP కృతజ్ఞతలు :** క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది బ్లైండ్ ఆంధ్రప్రదేశ్ (CABAP) రాష్ట్ర కార్యదర్శి జి. రవీంద్రబాబు మాట్లాడుతూ, దివ్యాంగ క్రికెట్ అభివృద్ధికి ACA అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. "2025-26 ఆర్థిక సంవత్సరంలో దివ్యాంగుల క్రికెట్‌కు ACA అందించిన అపూర్వమైన ఆర్థిక సహకారానికి, క్రీడాకారులకు అందిస్తున్న నిరంతర ప్రోత్సాహానికి ఏసిఏ అధ్యక్షుడు, కార్యదర్శి మరియు యాజమాన్యానికి CABAP తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (DCCAP) ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## రూ.6.60 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** దళిత కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పథంలో తీసుకెళతామని, నియోజకవర్గానికి వచ్చే నిధుల్లో సుమారు 40 నుంచి 50 శాతం దళిత కాలనీ అభివృద్ధికే కేటాయిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శనివారం స్థానిక నియోజకవర్గంలో సంజీవయ్య నగర్, ఆదిత్య నగర్, అరుంధతి నగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాల్లో రూ.6.60 కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైపు లైన్ల నిర్మాణానిక ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దళిత కాలనీల రూపురేఖలు మారుస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో దళిత కాలనీల్లో కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉండేవని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కాలనీలో అంతర్గత రోడ్లు సైతం నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.750 కోట్ల నిధులు విడుదల చేశారన్నారు. కేవలం రోడ్లు మాత్రమే కాకుండా మంచినీటి పైపులైన్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. కాలనీల్లో విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేస్తున్నామని చెప్పారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన నుంచి ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ వరకు బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఒకే విధానం ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గుంటూరు నగర అభివృద్ధి కోసం కూటమి పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలన్నారు. ప్రజలకు కూటమి ప్రభుత్వం జవాబుదారీగా ఉందని, నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి అవసరమొచ్చినా తమను సంప్రదించాలని సూచించారు.

## హోటళ్లపై వీఎంసీ కొరడా

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు..
రూ.26 వేల జరిమానా



**విజయవాడ, 05 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** నగరంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ఆహార విక్రయ కేంద్రాలపై వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు చేపట్టిన తనిఖీల్లో ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రతను పరిశీలించారు. అంబేద్కర్ కాలనీ 3వ లైన్‌లోని ప్రియా ఎగ్జిక్యూటివ్ బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేసి నిబంధనలు పాటించకపోవడంతో రూ.1,000 జరిమానా విధించారు. 37వ డివిజన్ పరిధిలోని పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ ప్రాంతంలో మిలిటరీ క్యాంటీన్, బాలాజీ షిర్డీ హోటల్, షిర్డీ క్యాంటీన్, శంకర్ విలాస్, శ్రీరామ ఫాస్ట్‌ఫుడ్స్ తదితర ఆహార విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని ఐదు దుకాణాలకు రూ.5,000 చొప్పున రూ.25,000 జరిమానా విధించారు. దుర్గాపురం డొంక రోడ్ ప్రాంతంలోని ఇడ్లీ, దోస హోటళ్లను కూడా తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణను పరిశీలించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు తప్పనిసరిగా పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే ప్రజలకు అందించాలని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలతో పాటు అవసరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కలలు కందాం.. నిజం చేసుకుందాం

**నారాజ్ పూఫాల ఆటలు సాగనివ్వం**

**అసంతుష్ట మామలకు మంచి పనులు గిట్టవు**

**యూపీఐ, స్పీడ్ రైల్ ఇలా ప్రతి దాన్నీ ఎందుకంటారు?**

**వారితో భారత్ పోరాడింది**

**దిమాగి నక్సల్స్ బండారం బయటపెట్టాం**

**నా ప్రత్యర్థులు నా పతనాన్ని కోరుకుంటున్నారు**

**వృద్ధి రేటు చూసి ఓర్వలేక పోతున్నారు**

**ఎస్ఆర్సీసీ శతాబ్ది వేడుకల్లో ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ:** దేశ యువతపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. కలలు కనడానికి, వాటిని నిజం చేసుకోవడానికి సరైన సమయం వచ్చిందని తెలిపారు. శనివారమిక్కడ శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ శతాబ్ది వేడుకల్లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ నారాజ్ పూఫా (అసంతుష్ట మామ) అనే పదాన్ని వాడి విమర్శకులపై వ్యాఖ్యలు చేశారు. క్యాంపస్ బయటికి వెళ్లాక రెండు రకాల మను షులు కనిపిస్తారని అన్నారు. ఒకరు సమాజ శక్తిని దేశ శక్తిగా మార్చేవారు. మరొకరు ఏ పని మొదలైనా వెంటనే నారాజ్ పూఫాలు అయిపోతారు. వారికి ఇష్టమైన పని ప్రతి దాన్ని వ్యతిరేకించడం. వారి అనే ఒకే ఒక్క మాట దీంతో ఏం అవసరం అని మోడీ విమర్శించారు. ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహం నిర్మిస్తున్నప్పుడు పూఫా దీనికి ఏం అవసరమని అడిగాడని, బుల్లెట్ రైలుపై పని మొదలుపెట్టినప్పుడు మళ్లీ అదే ప్రశ్న వేశాడని మోడీ చెప్పారు. యూపీఐ మొదలుపెట్టినప్పుడు కూడా ఈ పూపాలు యూ పీఐ ఏం అవసరమని అడిగారని, కొత్త పార్లమెంటు భవనం కట్టినప్పుడు కూడా అదే మాట అన్నారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీర సైనికులకు స్మారకం నిర్మించినప్పుడు పూఫా మళ్లీ మైదానంలోకి వచ్చి దీనికి ఏం అవసరమని అడిగాడని అన్నారు. కానీ భారత్ ఈ నారాజ్ పూఫాలందరికీ సమాధానం ఇచ్చిందని, దేశానికి అవసరమైన పని చేయడాన్ని ఎవరూ ఆపలేరని ప్రధాని స్పష్టం చేశారు. సత్యపు గర్జన ముందు అబద్ధాల ప్రతిధ్వని నిలవదని, అన్నారు. భారత్ తాజా ఆర్థిక వృద్ధి గణాంకాలపై విమర్శలు చేసేవారిపై స్పందించారు.

## దిమాగీ నక్సల్స్ గుట్టు రట్టు

పంద్రాగస్టు ప్రసంగంలో దిమాగీ నక్సల్ను ప్రస్తావించానని ప్రధాని మోడీ అన్నారు. తన ప్రసంగంలో ఎక్కడెక్కడో ఉన్న దిమాగీ నక్సల్స్ అంతా బైటకు వచ్చారని, వారి గుట్టు రట్టు అయ్యిందని తెలిపారు. తాను పతనమవ్వాలని ప్రత్య ర్థులు కోరుకుంటున్నారని అన్నారు.

## వృద్ధి రేటుకు ఓర్వలేకపోతున్నారు

దేశాన్ని పెళుసైన ఐదు దేశాల జాబితాలోకి నెట్టినవారు ఇప్పుడు భారత్ ప్రపం చంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా మారడాన్ని అంగీకరించలేకపోతున్నారని ఆయన అన్నారు. 7.8 శాతం త్రైమాసిక వృద్ధి దేశ ఆత్మ విశ్వాసాన్ని పెంచిందని పెళుసైన ఐదు దేశాల జాబితాలోకి భారతన్ను నెట్టి పేరు తెచ్చుకున్నవారికి ఈ గణాంకాలు జీర్ణం కావడం కష్టంగా ఉందని పేర్కొన్నారు. పదమూ డేళ్ల క్రితం 2013 ప్రసంగం తర్వాత మళ్లీ ఇదే కళాశాలకు వచ్చిన మోడీ, సగం నిండిన గ్లాసు ఉదాహరణను మళ్లీ తీసుకువచ్చారు. అప్పటి ప్రసంగంలో కొందరు గ్లాసును సగం నిండిందిగా, కొందరు సగం ఖాళీగా చూస్తారని, తాను మాత్రం పూర్తిగా నిండిం దిగా చూస్తానని, ఒక సగం నీరు, మరొక సగం గాలి అని చెప్పారు. 2018లో గ్లాసు సగం ఖాళీగా చూసేవారు ఇప్పటికీ అదే కోణంలో దేశాన్ని చూస్తున్నారని అన్నారు. వారికి గ్లాసు ఎప్పుడూ సగం ఖాళీగానే ఉంటుందని, తాను గ్లాసు గురించి మాట్లా డుతున్నానని, మరేదైనా ఖాళీగా ఉందని కాదని స్పష్టం చేశారు. శనివారం ప్రసంగా న్ని తన రిపోర్ట్ కార్డుగా అందించే అవకాశంగా ఆయన అభివర్ణించారు. 2013లో చెప్పిన ఆలోచనలను తర్వాతి ఏడాది అధికారంలోకి వచ్చిన తర్వాతి పనితో పోల్చు కుంటున్నానని చెప్పారు. 2013లో భారత్లో తయారీ చేయాలని చెప్పినప్పుడు అప్పటి వ్యవస్థ వారు అర్థం చేసుకోలేకపోయారని మోడీ అన్నారు. ఆనిరాశకాలంలో మేడ్ ఇన్ ఇండియా అసాధ్యమని వారు భావించారని, ఆ మనస్తత్వంతో పెరిగినవారు ఇప్పటికీ ఎగతాళి చేస్తున్నారని, కానీ నేడు మేక్ ఇన్ ఇండియా బ్రాండ్ విలువ కని పిస్తోందనిచెప్పారు. 2014లో భారత్ చాలా మొబైల్ ఫోన్లను దిగుమతి చేసుకునేదని, నేడు రూ.2.5 లక్షల కోట్లకు పైగా విలువైన హ్యాండ్సెట్లను ఎగుమతి చేస్తోందని పేర్కొ న్నారు. ఇది దేశీయ తయారీని బలోపేతం చేసిన విధానాలకు నిదర్శనమని అన్నారు. భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా, పరిశోధన, ఆవిష్కరణ కేంద్రంగా, వ్యవసాయ ఉత్పత్తుల ప్రధాన ఎగుమతిదారుగా మారుతోందని చెప్పారు.

## చిన్నారులతో ఢిల్లీ మెట్రోలో మోడీ

ఎస్ఆర్సీసీ కళాశాల శతాబ్ది వేడుకల్లో పాల్గొనడానికి ఢిల్లీ మెట్రోలో ప్రధాని ప్రయాణించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా లోక్ కల్యాణ్ మార్గ్ నుంచి విశ్వవిద్యాలయ స్టేషన్ వరకు మెట్రోలో వెళ్లారు. ప్రయాణంలో పిల్లలు, విద్యార్థులతో మాట్లాడారు. చేతులు కలిపారు. సెల్ఫీలు తీసుకున్నారు. విద్య, ఉద్యోగాలు, ఆకాంక్షలు, భవిష్యత్తు లక్ష్యాల గురించి 30 మంది విద్యార్థులతో సంభాషించినట్లు సమాచారం. మెట్రోలో పిల్లలతో కలిసి ప్రయాణించిన, మాట్లా డిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించాయి. ఉత్తర క్యాంప స్లోని కళాశాలకు చేరుకున్న తర్వాత ఆయన శతాబ్ది కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు, వంద రూపాయల స్మారక నాణెం విడుదల చేశారు. పదమూడేళ్ల క్రితం గుజరాత్ ముఖ్యమంత్రిగా ఇదే కళాశాలకు వచ్చిన మోడీ, ఈసారి ప్రధా నమంత్రిగా మెట్రోలో ప్రయాణించి, విద్యార్థులతో కలిసి వెళ్లడం గమనార్హం.

# తరగతి గదికి పరిమితం కావద్దు

**డ్రగ్స్, స్క్రీన్ టైమ్ పై ప్రత్యేక దృష్టి పెట్టండి**

**విద్యార్థుల జీవితాల్లో టీచర్లు భాగమవ్వాలి**

**చదువుతోపాటు పిల్లల ఆసక్తులు, అలవాట్లు గుర్తించాలి**

**మాదకద్రవ్యాల ముప్పుపై అవగాహన కల్పించాలి**

**క్రీడలతో మొబైల్ స్క్రీనింగ్కు చెక్ పెట్టవచ్చు**

**బోధనలో సృజనాత్మక పద్ధతులను ప్రవేశపెట్టాలి**

**జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రధాని మోడీ ఉద్బోధ**

**న్యూఢిల్లీ:** డ్రగ్స్ దుష్పరిణామాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించండి, స్క్రీన్ టైమ్ (మొబైల్ ఫోన్) తగ్గించడంలో వారికి సాయం చేయండి అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం జాతీయ పురస్కారం పొందిన ఉపాధ్యాయులతో సంభా షిస్తూ సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థులను సృజనాత్మక కృషి వైపు ప్రోత్సహిం చాలని అన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థుల ప్రవర్తన, రోజువారీ జీవితంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత ముఖ్యమవుతోందని అన్నారు. డ్రగ్స్ విషయంలో కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యా లయాల్లో ఎవరు ఎవరికి ఏమిచ్చారో తెలియకపోవడం వల్ల సమస్య ఎవరిని ప్రభావితం చేస్తోందో గుర్తించడం కష్టమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యా యు లు అవగాహన కోసం చొరవ తీసుకోవాలి. ఏ పిల్లవాడిలోనైనా ప్రవర్తనలో మార్పు కనిపిస్తే సూక్ష్మంగా గమనించాలి అని సూచించారు. విద్యార్థి బాల్యం చనిపోనివ్వకూడదు, విద్యార్థుల జీవితాల్లో బాల్యాన్ని సజీవంగా ఉంచడంలో ఉపాధ్యా యులే అతిపెద్ద కృషి చేయగలరని అన్నారు. స్క్రీన్ టైమ్ పెద్ద సమస్యగా మారిందని ప్రధానమంత్రి అన్నారు. పిల్లలు



మొబైల్ ఫోన్లతో ఎంత సమయం గడుపుతున్నారు. రాత్రి పొద్దుపోయాక కూడా మొబైల్ ఫోన్లు వాడుతున్నారా అని తల్లిదండ్రులను వాకబు చేయాలని ఉపాధ్యాయులను కోరారు. క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా పిల్లలు క్రమంగా అధిక స్క్రీన్ టైమ్ వినియోగం నుంచి బయటపడవచ్చని సూచించారు.

# 11 రోజుల తర్వాత సజీవంగా మరో ఇద్దరు

**60 ఏళ్ల మహిళను రక్షించిన సిబ్బంది**

**ఇంకా తీవ్రంగా శ్రమిస్తున్న రెస్క్యూ బృందాలు**

**ఇప్పటివరకు 1,344కు చేరిన మృతుల సంఖ్య**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5 :** నేపాల్ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరదలు, కొండచరియల విరిగిపడటంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. విపత్తు సంభవించి 11 రోజులు గడిచినా, శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసేందుకు భద్రతా బలగాలు, అంతర్జాతీయ రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ క్రమంలో శనివారం ఇద్దరిని సజీవంగా రక్షించడం ఆశలు రేకెత్తించింది. ఒక విదేశీయుడిని అపర్ త్రిశూలీ-1 జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి బయటకు తీసుకురాగా, మరో మహిళను నువాకోట్ జిల్లా బిదూర్లో కాపాడారు. మరోవైపు వరదల్లో ఇప్పటివరకూ మృతి చెందిన వారి సంఖ్య 1,344కు చేరింది. భోటేకోశీ వరదల ప్రభావంతో తీవ్రంగా దెబ్బతిన్న అపర్ త్రిశూలీ-1 ప్రాజెక్టు సొరంగంలో చిక్కుకున్న ఓ విదేశీయుడిని నేపాల్ సైన్యం సజీవంగా బయటకు తీసింది. రెస్క్యూ అనంతరం అతడిని హెలికాప్టర్ వద్దకు తరలించి వైద్య సిబ్బంది ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ఇదే సమయంలో నువాకోట్ పట్టణంలో.., ధ్వంసమైన ఒక ఇంటి నుంచి చండికా శ్రేష్ఠ అనే 64ఏళ్ల వృద్ధురాలిని సహాయ సిబ్బంది ప్రాణాలతో బయటకు తీశారు. మెరుగైన వైద్యం కోసం ఆమెను హెలికాప్టర్లో కాఠ్మాండ్ తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అత్యంత దయనీయ స్థితిలో ఉన్న వృద్ధురాలిని దుప్పటిలో చుట్టి ఇంటి నుంచి బయటకు మోసుకెళ్తున్న దృశ్యాలను



నేపాల్ సైన్యం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఇప్పటికే శుక్రవారం త్రిశూలీ-3ఏ జలవిద్యుత్ ప్రాజెక్టు సొరంగం నుంచి ఇద్దరు నేపాలీలను సజీవంగా బయటకు వచ్చారు. వరదల్లో కొట్టుకుపోయిన మృతదేహాలు ఎక్కువగా నీటిలో ఎక్కువకాలం ఉండటం, బురద, శిథిలాల కింద చిక్కుకోవడంతో తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా లభించకపోవడంతో మృతుల గుర్తింపు అధికారులకు పెద్ద సవాలుగా మారింది. ఇప్పటివరకు అవసరమైన ప్రక్రియలు, డీఎన్ఏ నమూనాల సేకరణ పూర్తయ్యాక 1,030 మృతదేహాలను తాత్కాలికంగా ఖననం చేశారు. అయితే గుర్తింపు పూర్తైన 96 మృతదేహాలను మాత్రమే కుటుంబాలకు అప్పగించారు. మృతుల గుర్తింపులో డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి. ఇందుకోసం మృతదేహాల నుంచి సేకరించిన నమూనాలను కుటుంబ సభ్యుల జీవ నమూనాలతో సరిపోల్చాల్సి ఉంటుంది. నువాకోట్లోని తాత్కాలిక ఫీల్డ్ ఆసుపత్రిలో డీఎన్ఏ నమూనాల సేకరణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. నేపాల్ సైన్యం సుమారు 20 హెలికాప్టర్లను సహాయక చర్యలకు వినియోగిస్తోంది. నువాకోట్, రసువా జిల్లాల్లో గాలింపు, రక్షణ, సహాయక సామగ్రి పంపిణీ నిరంతరం కొనసాగుతోంది. ప్రతికూల వాతావరణం, ప్రమాదకరమైన పర్వత ప్రాంతాలు, వరదలకు దెబ్బతిన్న హెలిప్యాడ్ల కొరత ఉన్నప్పటికీ హెలికాప్టర్లు సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయి. నువాకోట్లో ఉప్పొంగిన టాడీ నదిపై తాత్కాలిక తాడు వంతెన నిర్మించేందుకు సైనిక ఇంజినీరింగ్ బృందాలు పనిచేస్తున్నాయి. రహదారి సంబంధాలు తెగిపోయిన ప్రాంతాలకు భూసంబంధిత రవాణాను పునరుద్ధరించడమే లక్ష్యంగా ఈ పనులు సాగుతున్నాయి. ఈ విపత్తులో ఇప్పటివరకు 1,344 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో దాదాపు 5 వేల మంది ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. గల్లంతైన వారిలో కనీసం 589 మంది విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా ప్రజలను రక్షించారు. నేపాల్లోని ఎనిమిది జిల్లాల్లో మృతదేహాలు లభ్యమయ్యాయి. చిత్వాన్లో అత్యధికంగా 360 మృతదేహాలు లభించగా, పశ్చిమ నావల్పరాసీలో 230, తూర్పు నావల్పరాసీలో 222 మృతదేహాలు వెలికితీశారు. మిగిలినవి నువాకోట్, రసువా, గోర్ఖా, ధాదింగ్, తనహూన్ జిల్లాల్లో లభించాయి.

# ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థతోనే వికసిత్ భారత్

**టీచర్లను గౌరవించే సమాజం పురోగమిస్తుంది**

**82 మంది ఉత్తమ టీచర్లకు రాష్ట్రపతి ముర్ము పురస్కారాల ప్రదానం**

**న్యూఢిల్లీ:** ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థతోనే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపా ధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివా రం మూడు విభాగాల నుంచి ఎంపికైన 82 మంది ఉపాధ్యాయులు, విద్యావేత్త లకు జాతీయ పురస్కారాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రస ంగిస్తూ దేశ ద్వితీయ రాష్ట్రపతి డాక్టర్ సర్వే పల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినో త్సవంగా జరుపుకోవడం ద్వారా మన దేశవాసులు ఆయన పట్ల మొత్తం ఉపాధ్యాయసమాజంపట్లగౌరవం వ్యక్తం చేస్తున్నారు. ఉపా ధ్యాయులను గౌరవించే సమాజమే నిజమైన అర్థంలో పురోగమిస్తుంది. ఉపాధ్యా యుల మధ్యకు వచ్చినప్పుడు నాలోని విద్యార్థి, ఉపాధ్యాయురాలు ఇద్దరూ సజీవమవుతారు. నేను ఒకప్పుడు ఉపాధ్యాయురాలిగా పనిచేసినందుకు గర్విస్తున్నా ను అని అన్నారు. మనం వికసిత భారత్ లక్ష్యం వైపు సాగుతున్నాం. ఈ లక్ష్యం ప్రప ంచ స్థాయి విద్యా వ్యవస్థ ద్వారానే సాధ్యం. మన ఉపాధ్యాయులే విద్యా వ్యవస్థకు ప్రాణం పోస్తారు. దేశంలో ఒక్క విద్యార్థి కూడా నాణ్యమైన విద్యా అవకాశాలకు దూరం కాకుండా చూడాలి. మనరాజ్యాంగంలో పొందుపరచిన అవకాశాల సమా నత్వ ఆదర్శాన్ని సాకారం చేయడానికి విద్యే అత్యంత సమర్థవంతమైన మార్గం అని ముర్ము తెలిపారు. భారతదేశాన్ని జ్ఞాన మహాశక్తిగా మార్చడంతో పాటు ప్రపంచ నైపుణ్య రాజధానిగా నిలబెట్టడం మన జాతీయ ప్రాధాన్యతల్లో ఒకటిగా ఉందని చెప్పారు.

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం

**ఉక్రెయిన్పై 3రోజుల పాటు దాడులను నిలిపివేసిన పుతిన్**

**న్యూఢిల్లీ :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శాంతి చర్చలకు అమెరికా ప్రతినిధులు మాస్కో చేరుకున్న వేళ రష్యా-ఉక్రెయిన్ తాత్కాలికంగా దాడులను నిలిపివేశాయి. జెలెన్స్కీ, పుతిన్ ప్రకటించిన 3 రోజుల విరామం శాశ్వత శాంతి ఒప్పందానికి బాటలు వేస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. రష్యా అధ్యక్ష భవనం ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ప్రకారం, శనివారం అర్ధరాత్రి నుంచి కీవ్పై మూడు రోజుల పాటు ఎలాంటి దాడులు జరపకూడదని పుతిన్ ఆదేశించారు. అమెరికా ప్రతినిధుల ఉక్రెయిన్ పర్యటన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. విట్కాఫ్, కుష్నర్ శనివారం మాస్కో చేరుకున్నారు. రష్యా ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రియేవ్ విమానాశ్రయంలో వారికి స్వాగతం పలికారు. 'వెల్కమ్ టు మాస్కో పీస్మేకర్స్' అంటూ వారి రాకకు సంబంధించిన ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అమెరికా ప్రతినిధులు ఆదివారం కీవ్కు వెళ్లే అవకాశం ఉంది. గతంలో వీరు మాస్కోను సందర్శించినప్పటికీ, కీవ్లో పర్యటించడం ఇదే తొలిసారి. అమెరికా ప్రతినిధుల పర్యటన సమయంలో ఉక్రెయిన్ కూడా వైమానిక దాడులను నిలిపివేస్తుందని అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్స్కీ ఇప్పటికే ప్రకటించారు. రష్యా కూడా ఇదే విధంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అయితే అమెరికా ప్రతినిధుల రాకకు ముందు రష్యా కీవ్, బోరిస్పిల్ అంతర్జాతీయ విమానాశ్రయాలపై దాడులు చేసిందని జెలెన్స్కీ ఆరోపించారు. అమెరికా ప్రతినిధులు విమానంలో ఉక్రెయిన్కు చేరుకునే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకునే ఈ దాడులు జరిగి ఉండొచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. తమ డ్రోన్లు, క్షిపణుల కారణంగా రష్యా గగనతలం కూడా ప్రమాదకరంగా మారిందని పేర్కొన్న జెలెన్స్కీ, తదుపరి వారంలో రష్యా గగనతలానికి సంబంధించి తమ చర్యలను సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఐదో ఏడాదిలోకి ప్రవేశించినప్పటికీ, కాల్పుల విరమణ, శాంతి ఒప్పందం విషయంలో ఇప్పటివరకు స్పష్టమైన పురోగతి కనిపించలేదు. దాదాపు 1,250 కిలోమీటర్ల ఫ్రంట్లైన్లోనూ ఇరు దేశాల దళాలు పెద్దగా ముందడుగు వేయలేకపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా ప్రతినిధుల మాస్కో, కీవ్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. పుతిన్ ప్రకటించిన 72 గంటల దాడుల విరామం చర్చలకు అనుకూల వాతావరణం కల్పిస్తుందా? అమెరికా మధ్యవర్తిత్వంతో ఇరు దేశాలు మళ్లీ చర్చల బాట పడతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.శాంతి చర్చలు నిలిచిపోవడంతో ఇటీవలి కాలంలో రష్యా ఉక్రెయిన్పై వైమానిక దాడులను మరింత తీవ్రతరం చేసింది. కీవ్తో పాటు పలు నగరాలపై రాత్రి మాత్రమే కాకుండా పగటి వేళల్లోనూ దాడులు జరుగుతున్నాయి. శుక్రవారం రష్యా డ్రోన్ కీవ్లోని ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీస్ (ఎస్?బీయూ) ప్రధాన కార్యాలయాన్ని ఢీకొట్టింది. రష్యాలోని సైనిక లక్ష్యాలపై దీర్ఘశ్రేణి దాడులు నిర్వహిస్తున్న ఉక్రెయిన్ సంస్థల్లో ఎస్?బీయూ కూడా ఒకటి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలోని సైనిక స్థావరాలు, చమురు శుద్ధి కేంద్రాలు, ఇతర కీలక ఆర్థిక మౌలిక వసతులపై డ్రోన్, క్షిపణి దాడులు చేస్తోంది. రష్యా యుద్ధ సామర్థ్యాన్ని, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు యుద్ధ ప్రభావాన్ని అక్కడి ప్రజలకు తెలియజేయాలన్నది ఉక్రెయిన్ వ్యూహంగా కనిపిస్తోంది. రష్యా రోస్టోవ్, వొరోనెజ్ ప్రాంతాల నుంచి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించడంతో పాటు రాత్రికి 167 దాడి డ్రోన్లను ఉపయోగించినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది. వీటిలో షహెద్ తరహా డ్రోన్లతో పాటు జెరాన్, డీకాయ్ డ్రోన్లు ఉన్నాయని పేర్కొంది. ఉక్రెయిన్ వైమానిక రక్షణ వ్యవస్థలు 128 డ్రోన్లను కూల్చివేయడం లేదా అడ్డుకోవడం జరిగిందని అధికారులు తెలిపారు.

# 4 రాష్ట్రాల్లో జనగణన

**ఈ డిసెంబర్ 1 నుంచే షురూ!**

**న్యూఢిల్లీ,సెప్టెంబర్5 :** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏడాది ఉత్తరాఖండ్, పంజాబ్, ఉత్తర్ప్రదేశ్, గోవాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఈ రాష్ట్రాల్లో జనగణన ప్రక్రియను కాస్త ముందుగానే నిర్వహించాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి తాజాగా షెడ్యూల్ విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 1న జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కానుండగా, ఇది వచ్చే ఏడాది అంటే 2027 జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ జనాభా గణనకు సంబంధించిన వివరాల్ని భారత రిజిస్ట్రార్ జనరల్ (=+× - రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా), సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తాజాగా విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్లో పేర్కొన్నారు. అయితే ఈ 4 రాష్ట్రాల్లోని ప్రజలు ముందుగానే వారి వివరాల్ని నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) సౌకర్యాన్ని కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఆప్షన్ జనగణన అధికారిక ప్రక్రియ ప్రారంభమయ్యే ముందు 15 రోజులు అంటే 2026 నవంబర్ 16 నుంచి 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

# లారీలోకి చొచ్చుకెళ్లిన కారు

**8 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు దుర్మరణం.. కేరళంలో ఘటన**

**తిరువనంతపురం:** కేరళ రాష్ట్రం, త్రిసూర్ జిల్లా హైవేపై పార్కు చేసిన లారీని వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో తమిళనాడుకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు మరణించారని పోలీసులు శనివారం తెలిపారు. ప్రమాదం శుక్రవారం రాత్రి సుమారు 11:40 గంటలకు కైపమంగళంలో జరిగింది. సీసీటీవీ దృశ్యాల్లో కారు దాదాపు ఖాళీగా ఉన్న 66వ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తూ లారీని ఢీకొ నడం కనిపించింది. ఢీకొన్న వెంటనే దుమ్ము మేఘం లేవడం కనిపించింది. ప్రాథ మిక సమాచారం ప్రకారం మృతులు తమిళనాడు దిండిగల్ లోని పీ ఎస్ఎన్ ఏ ఇం జనీరింగ్ కళాశాల విద్యార్థులు. తమిళనాడు రిజి స్ట్రేషన్ ఉన్న కారు గురువాయూర్ వైపు నుంచి కొడుంగల్లూర్ వైపు వెళ్తుండగా, హైవేలో నిర్మాణంలో ఉన్న భాగంలో మళ్లింపు వద్ద వద్ద పార్కు చేసిన లారీని ఢీకొంది. ఎనిమిది మంది అక్కడికక్కడే మర ణించారని పోలీసులు తెలిపారు. నుజ్జునుజ్జు అయిపోయిన కారును కోసి మృత దేహాలను బయటకు తీయాల్సివచ్చింది. స్థానికులు అగ్నిమాపక రక్షణ సిబ్బంది. పోలీసులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. మృతదేహాలను త్రిసూర్ వైద్య కళాశాల మార్చురీకి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

# ఉపాధ్యాయ దినోత్సవం రోజున సచిన్ టెండూల్కర్ కీలక ప్రకటన

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తన తండ్రి, తన మొదటి గురువు అయిన ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్‌ను స్మరించుకున్నారు. ఆయన స్మారకార్థం 'ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ మెమోరియల్ ఫెలోషిప్'ను ప్రకటించి తన తండ్రికి ఘన నివాళి అర్పించారు. విద్య ద్వారా లభించిన అవకాశాలను సమాజ సేవకు ఉపయోగించాలన్న తన తండ్రి ఆశయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సచిన్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక ప్రకటన చేశారు. "నా జీవిత ప్రయాణం గురించి ఆలోచించినప్పుడు, నాకు క్రికెట్ మైదానం గానీ, కోచ్ గానీ గుర్తుకురారు. మా ఇల్లే నా కళ్ల ముందు మెదులుతుంది. నా కుటుంబం బయట నా పేరు ఎవరికీ తెలియకముందే, క్రికెట్‌పై నాకున్న ప్రేమను, అది నాకెంత ముఖ్యమో మా నాన్న గుర్తించారు. ఈ ప్రయాణం నన్ను ఎక్కడికి తీసుకెళుతుందదో ఆయనకు కచ్చితంగా తెలియదు. కానీ, దాన్ని కొనసాగించే స్వేచ్ఛను నాకు ఇచ్చారు. మా నాన్న రమేశ్ టెండూల్కర్ ఒక రచయిత, కవి, ప్రొఫెసర్. కానీ వీటన్నింటికంటే నాకు, మరెందరికో ఆయన ఒక గొప్ప మార్గదర్శి. క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకునే స్వేచ్ఛను ఇస్తూనే, విజయం కోసం వ్యక్తిత్వాన్ని ఎప్పుడూ పణంగా పెట్టకూడదని గుర్తుచేశారు. "ఓడిపోవడం తప్పు కాదు, కానీ మోసం చేయడం నేరం. ఎప్పుడూ అడ్డదారులు వెతకొద్దు" అని నాన్న చిన్నప్పుడు చెప్పిన మాటలు నా జీవితాంతం గుర్తుంటాయి. ఆనాడు నేను



కేవలం క్రికెట్ ఆడటాన్ని ఇష్టపడే ఒక బాలుడిని. కానీ నాన్న నాలో అంతకుమించి ఏదో చూశారు. నేను ఏమవ్వాలో ఆయన నిర్ణయించలేదు. బదులుగా, నా మార్గాన్ని నేనే కనుగొనేందుకు అవసరమైన స్వేచ్ఛను, మద్దతును ఇచ్చారు. గొప్ప గురువు లేదా మార్గదర్శి చేసే పని అదే. మనలోని సామర్థ్యాన్ని మనకంటే ముందే వారు గుర్తిస్తారు. భారతదేశంలో యువ ప్రతిభకు కొదవలేదు. కానీ చాలామందికి సరైన కోచ్, మార్గదర్శి, ప్రోత్సాహం వంటివి అందుబాటులో ఉండవు. ఈ నమ్మకంతోనే నేను, అంజలి మా ఫౌండేషన్‌ను ప్రారంభించాం. క్రీడలు, విద్య, ఆరోగ్య సంరక్షణలో సమాన అవకాశాలు కల్పించడమే మా లక్ష్యం. ఈ ఉపాధ్యాయ దినోత్సవం రోజున, నాలో ఏదో ఉందని నమ్మి, నేను ఏమవుతానో ఊహించిన ఆ మొదటి వ్యక్తిని గౌరవించుకునే అవకాశం తీసుకుంటున్నాను. మా ఆరోగ్య సంరక్షణ భాగస్వామి 'ఇంగా హెల్త్ ఫౌండేషన్'తో కలిసి 'ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ మెమోరియల్ ఫెలోషిప్'ను ప్రవేశపెడుతున్నందుకు గర్వంగా ఉంది. దీని ద్వారా ప్రతి ఏటా ఒక ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) వైద్యుడికి శ్రీనగర్‌లో 'క్లెఫ్ట్ అండ్ క్రెనియోఫేషియల్ కేర్'లో ప్రత్యేక శిక్షణ పొందేందుకు ఏడాది పాటు ఆర్థిక సహాయం అందిస్తాం. నాకు ఇది కేవలం ఒక ఫెలోషిప్ మాత్రమే కాదు. విద్య అవకాశాలను సృష్టిస్తుందని, ఆ అవకాశం ఇతరుల సేవకు ఉపయోగపడినప్పుడే దానికి నిజమైన అర్థం వస్తుందని మా నాన్న బలంగా నమ్మేవారు. ఆయన నమ్మకాన్ని ముందుకు తీసుకెళ్లే మార్గం ఇది. ఒక ఉపాధ్యాయుడి పాఠాలు ఒక విద్యార్థితో మొదలవ్వొచ్చు, కానీ దాని ప్రభావం ఒకరి నుంచి మరొకరికి, ఒక తరం నుంచి మరో తరానికి ప్రయాణిస్తుంది. అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు" అంటూ సచిన్ తన పోస్టులో పేర్కొన్నారు.

## 'వైభవ్ కోసం నా భార్య కూడా దులీప్ ట్రోఫీ చూసింది'

### క్రికెట్ దిగ్గజం ఆసక్తికర వ్యాఖ్యలు



వైభవ్ సూర్యవంశీ.. ఈ పేరు వినిపిస్తే చాలు క్రికెట్ అభిమానులు టీవీలకు అతుక్కుపోతున్నారు. ఐపీఎల్‌లో మొదలైన ఈ క్రేజ్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌కు చేరింది. 15 ఏళ్ల ఈ యువ బ్యాటర్ కోసం దులీప్ ట్రోఫీ మ్యాచ్‌ను కూడా చాలామంది ఆసక్తిగా చూస్తున్నారు. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించాడు. తన యూట్యూబ్ షోలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లో వైభవ్ బ్యాటింగ్ చూసేందుకు తాను, తన భార్య కూర్చున్నామని చెప్పారు. "వైభవ్‌కు ఉన్న క్రేజ్ ఇది. మనలో చాలామంది అతను బ్యాటింగ్ చేసేటప్పుడు మ్యాచ్ చూశాం. నా భార్య కూడా దులీప్ ట్రోఫీ మ్యాచ్ చూసింది" అని అన్నాడు. ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్ మధ్య జరిగిన సెమీఫైనల్లో వైభవ్ 81 బంతుల్లో 92 పరుగులు చేశాడు. ఏడు సిక్సర్లు, ఏడు ఫోర్లతో విరుచుకుపడ్డాడు. సెంచరీకి చేరువగా వచ్చి ఔటయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేశాడు. దీంతో ఈస్ట్ జోన్ 14 ఏళ్ల తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు చేరింది.

### 90ల్లోనే ఆగిపోతున్నాడు!

వైభవ్ తరచూ సెంచరీకి చేరువగా వచ్చి ఆగిపోవడంపై శ్రీకాంత్ సరదాగా స్పందించాడు. "మళ్లీ సెంచరీ మిస్ చేశావు. నాకంటే ఎక్కువగా 90ల్లో ఔటవుతున్నావు" అంటూ చమత్కరించాడు. ఈ సీజన్ ఐపీఎల్‌లో వైభవ్ 93, 97, 96 పరుగులు చేశాడు. ఇప్పుడు దులీప్ ట్రోఫీలో 92 పరుగులు చేశాడు. అతడి దూకుడు బ్యాటింగ్ శైలిని శ్రీకాంత్ ప్రశంసించారు. మీడియం పేసర్లను కూడా ధైర్యంగా ఎదుర్కొంటున్నాడని అన్నాడు. తన ఆటను మరింత మెరుగుపర్చుకుంటే మరో స్థాయికి వెళ్తాడని చెప్పాడు. వైభవ్ కెప్టెన్‌గానూ బాధ్యతలు చేపట్టడంపై శ్రీకాంత్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇషాన్ కిషన్ మైదానం వీడిన సమయంలో అతడు ఈస్ట్ జోన్‌కు నాయకత్వం వహించాడు. "అతడు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు కొంత సందేహించాను. కానీ జట్టు ఫైనల్‌కు చేరింది" అని శ్రీకాంత్ అన్నాడు. వైభవ్‌ను జాగ్రత్తగా తీర్చిదిద్దాలని శ్రీకాంత్ సూచించాడు. "అతడికి సరైన మార్గనిర్దేశం లభిస్తే సూపర్‌స్టార్ అవుతాడు" అని చెప్పాడు. భవిష్యత్తులో టెస్టు క్రికెట్‌పై కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచగలడని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. ప్రపంచ క్రికెట్‌కు అతడు గొప్ప ఆస్తిగా మారతాడని పేర్కొన్నాడు.

## 'అక్కడే ఉండండి.. లేదంటే మీరే చూసుకోండి'.. ఆసియా క్రీడల్లో వసతిపై బీసీసీఐకి షాక్





ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత క్రికెట్ జట్లకు ప్రత్యేక వసతి కల్పించాలన్న బీసీసీఐ అభ్యర్థనను 'భారత ఒలింపిక్ సంఘం' (ఐఓఏ) తిరస్కరించినట్లు సమాచారం. అయితే నిర్వాహకులు ఏర్పాటు చేసిన వసతి తమ అవసరాలకు సరిపోదని భావిస్తే.. సొంతంగా వసతి ఏర్పాటు చేసుకునేందుకు బీసీసీఐకి అవకాశం ఇచ్చింది. ఐఓఏ సీఈఓ రఘురామ్ అయ్యర్ మాట్లాడుతూ బీసీసీఐ సీఈఓ హేమంగ్ అమిన్ తమను సంప్రదించారని తెలిపారు. వసతి సౌకర్యాలను పరిశీలించేందుకు బీసీసీఐ వచ్చే వారం జపాన్‌కు అడ్వాన్స్ టీమ్‌ను పంపనుందని చెప్పారు. అక్కడి పరిస్థితులను పరిశీలించిన తర్వాత నిర్వాహకుల వసతినే ఉపయోగించాలా, సొంత ఏర్పాట్లు చేసుకోవాలా అనేది బీసీసీఐ నిర్ణయించుకోవచ్చని స్పష్టం చేశారు. ఆసియా క్రీడల నిర్వాహకులు ఇప్పటికే పురుషుల, మహిళల క్రికెట్ జట్లకు వసతి కేటాయించారు. శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోని పురుషుల జట్టుకు నగోయాలోని 3 స్టార్ ఏపీఏ హోటల్ నగోయా ఎకిమేలో గదులు కేటాయించినట్లు సమాచారం. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని మహిళల జట్టుకు ఓ ఫోర్ స్టార్ హోటల్‌లో వసతి కల్పించనున్నారు. ఈ వసతులు 5 స్టార్ హోటళ్ల స్థాయిలో లేకపోవడంతో పాటు.. ఆటగాళ్లకు ట్విన్ షేరింగ్ విధానంలో గదులు కేటాయించడంపై బీసీసీఐలో అభ్యంతరాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. మహిళల జట్టుకు మాత్రం ప్రయాణ పరంగా మరింత సవాలు ఎదురుకానుంది. దుబాయ్ లో జరుగుతున్న ఆసియా కప్ లో ఫైనల్‌కు చేరితే.. ఆ మ్యాచ్ ముగిసిన మరుసటి రోజే జపాన్‌కు బయలుదేరాల్సి ఉంటుంది. 36 క్రీడాంశాల్లో పాల్గొనే అన్ని భారత బృందాలకు సమానంగా వసతి కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని ఐఓఏ తెలిపింది. క్రీడాకారులు వసతి, ప్రయాణం వంటి అంశాలపై కాకుండా కేవలం ఆటపై దృష్టి పెట్టేలా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామని రఘురామ్ అయ్యర్ చెప్పారు.

## సీఎస్కే కెప్టెన్ మారనున్నాడా? తెరపైకి మరో స్టార్ బ్యాటర్ పేరు..!



చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) కెప్టెన్సీపై ఆసక్తికర చర్చ మొదలైంది. గత మూడు సీజన్లుగా జట్టు ప్లేఆఫ్స్‌కు చేరకపోవడంతో నాయకత్వంలో మార్పు అవసరమని మాజీ భారత ఓపెనర్ సదగోపన్ రమేశ్ అభిప్రాయపడ్డారు. కెప్టెన్‌గా రుతురాజ్ గైక్వాడ్‌కు బదులుగా సంజూ శాంసన్‌ను ఎంపిక చేయాలని సూచించారు. సంజూ అద్భుతమైన టీమ్ ప్లేయర్ అని ఆయన పేర్కొన్నారు. గత మూడు ఐపీఎల్ సీజన్లలో సీఎస్కే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. దీనికి తోడు 2026 సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ బ్యాటింగ్ ప్రదర్శనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జట్టులో సంజూ శాంసన్ చేరడం కెప్టెన్సీ మార్పుపై ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. "సీఎస్కే కెప్టెన్సీ కోసం పలు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు కనిపిస్తోంది. మార్పు అవసరమా అనే అంశంపైనా ఆలోచిస్తోంది. సంజూ శాంసన్‌ను కెప్టెన్‌గా పరిగణించాలి. అతను అద్భుతమైన టీమ్ ప్లేయర్" అని సదగోపన్ రమేశ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో పేర్కొన్నారు. ఐపీఎల్‌లో సంజూ శాంసన్ కెప్టెన్‌గా 66 మ్యాచ్‌లకు నాయకత్వం వహించారని, అందులో 33 మ్యాచ్‌ల్లో జట్టును గెలిపించారని రమేశ్ గుర్తుచేశారు. అంటే అతని విజయాల శాతం 50గా ఉందన్నారు. అతని నాయకత్వంలో రాజస్థాన్ రాయల్స్ ఒకసారి ఫైనల్‌కు చేరడంతో పాటు మరోసారి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిందని తెలిపారు. అయితే సంజూను కెప్టెన్‌గా నియమించినంత మాత్రాన సీఎస్కే సమస్యలన్నీ పరిష్కారం కావని రమేశ్ స్పష్టం చేశారు. జట్టులో ఇంకా చాలా మార్పులు అవసరమని చెప్పారు. మరోవైపు రుతురాజ్ గైక్వాడ్ 2026 ఐపీఎల్‌లో 337 పరుగులు మాత్రమే చేశాడు. అతని బ్యాటింగ్ సగటు 28గా ఉంది. పవర్‌ప్లేలో బ్యాటింగ్ చేసిన ఆటగాళ్లలో అత్యల్ప స్ట్రైక్‌రేట్ నమోదు చేసిన వారిలో రుతురాజ్ ఉన్నాడు. కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పిస్తే బ్యాటర్‌గా మరింత స్వేచ్ఛగా ఆడే అవకాశం ఉంటుందని మాజీ భారత క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ కూడా గతంలో అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీ నుంచి తప్పించడం రుతురాజ్‌కు, సీఎస్కేకి ప్రయోజనకరమేనని అన్నారు.

## వాళ్లంతా పిరికిపందలు.. సహచర అథ్లెట్లపై ఒలింపిక్ ఛాంపియన్ తీవ్ర వ్యాఖ్యలు




ఒలింపిక్ ఛాంపియన్, నార్వే స్టార్ అథ్లెట్ జాకోబ్ ఇంజెబ్రిగ్‌స్టెన్‌కు డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో అనూహ్య పరాజయం ఎదురైంది. బ్రస్సెల్స్‌లో శుక్రవారం జరిగిన పురుషుల 1,500 మీటర్ల పరుగు పందెంలో అతడు నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అయితే, రేసు ముగిసిన అనంతరం తన ఓటమి కంటే కూడా ప్రత్యర్థులపై చేసిన ఘాటు వ్యాఖ్యలతో అతడు వార్తల్లో నిలిచాడు. తనతో పాటు పోటీపడిన అథ్లెట్లను 'పిరికిపందల గుంపు' అంటూ తీవ్రంగా విమర్శించాడు. ఈ రేసులో ఆస్ట్రేలియాకు చెందిన 20 ఏళ్ల యువ అథ్లెట్ కామెరాన్ మయర్స్ 3:30.14 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకుని విజేతగా నిలిచాడు. కెన్యాకు చెందిన ఫానుయెల్ కిపోక్సగీ కోచ్ (3:30.18), అమెరికాకు చెందిన ఏథాన్ స్ట్రాండ్ (3:30.50) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఇంజెబ్రిగ్‌స్టెన్ 3:30.52 నిమిషాల టైమింగ్‌తో నాలుగో స్థానానికి పరిమితమయ్యాడు. రేసులో ఎక్కువ భాగం ఆధిక్యంలో ఉన్నప్పటికీ, చివరి 30 మీటర్లలో ఇంజెబ్రిగ్‌స్టెన్ వెనుకబడిపోయాడు. రేసు అనంతరం జాకోబ్ ఇంజెబ్రిగ్‌స్టెన్ తన అసహనాన్ని ఏమాత్రం దాచుకోలేదు. "నేను ఒక పిరికిపందల గుంపుతో పోటీ పడ్డాను" అని వ్యాఖ్యానించాడు. ప్రత్యర్థులు కేవలం తన వెనుక వరుసలో ఉండి దాక్కోవాలని చూశారని ఆరోపించాడు. చివరి 30 మీటర్లకు వచ్చేసరికి ప్రత్యర్థులు ఒక్కసారిగా తనకు అడ్డుగా వచ్చినట్లు పేర్కొన్నాడు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో అకిలెస్ టెండన్ సర్జరీ చేయించుకున్న ఇంజెబ్రిగ్‌స్టెన్, ప్రస్తుతం పూర్తి ఫిట్‌నెస్ సాధించే క్రమంలో ఉన్నాడు.


# తమన్నాకి ఆ హీరో ప్రపోజ్ చేసాడా?

మిల్కీబ్యూటీ తమన్నా భాటియా ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ప్రధానంగా తన ఫోకస్‌ను హిందీ చిత్ర పరిశ్రమపైనే పెట్టారు. ఐటెం సాంగ్స్‌తో పాటు హీరోయిన్‌గానూ ఆమెకు అవకాశాలు క్యూకడుతున్నాయి. విజయ్ వర్మతో బ్రేకప్ తర్వాత కెరీర్, వ్యాపారాలపై సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇదిలాఉండగా ఓ స్టార్ హీరో వేదిక మీదే తమన్నాకు ప్రపోజ్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. లస్ట్ స్టోరీస్ 2 సమయంలో తన సహనటుడు విజయ్ వర్మతో తమన్నాకి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరూ కొన్నాళ్లు సీక్రెట్‌గా డేటింగ్ చేశారు. సినిమా ఫంక్షన్లు, ఈవెంట్స్, విహారయాత్రలతో తమన్నా - విజయ్ హల్‌చల్ చేశారు. కానీ ఎక్కడా కూడా తమ బంధాన్ని బయటపెట్టలేదు. ఆ తర్వాత నెమ్మదిగా ఇద్దరూ ఓపెన్ అయ్యారు. రేపో మాపో పెళ్లి అనుకుంటుండగా తమన్నా - విజయ్ వర్మలు అనూహ్యంగా విడిపోయారు. వీరి మధ్య బ్రేకప్‌కు దారి తీసిన కారణాలు ఏంటన్నది మాత్రం తెలియరాలేదు. కెరీర్‌లో నిలదొక్కుకోవాలని విజయ్ వర్మ.. పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడాలని తమన్నా నిర్ణయించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా బాలీవుడ్ మీడియా కోడై కూసింది. బ్రేకప్ తర్వాత తమన్నా- విజయ్‌లు వారి జీవితాల్లో బిజీ అయ్యారు. సినిమాలు, షూటింగ్స్, బిజినెస్ ఇతర వ్యవహారాల్లో తలమునకలయ్యారు. ఈ బాధ నుంచి బయటకు రావడానికి సినిమాలను పెంచారు తమన్నా. అలాగే ఇప్పటి వరకు గ్లామరస్ రోల్స్ చేసిన నో కిస్ రూల్‌ను పక్కాగా ఫాలో అయిన ఈ ముద్దుగుమ్మ.. ఈ నిబంధనను కూడా పక్కనపెట్టారు. ఇంటిమేట్ సీన్స్, బెడ్ సీన్స్‌లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. దీనికి తగినట్లుగానే రాగిణి ఎంఎంస్ 3 వంటి బోల్డ్ సినిమాలో నటించేందుకు అగ్రిమెంట్ మీద సంతకం చేసింది. ప్రస్తుతం తమిళంలో పురుషన్, హిందీలో వీవాన్ ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్, వీ శాంతారామ్ బయోపిక్, రోహిత్ శెట్టి, జగన్ శక్తిలు తెరకెక్కించనున్న సినిమాలలో తమన్నా నటిస్తున్నారు. ఇవి కాకుండా మరిన్ని ప్రాజెక్ట్‌లు చర్చల దశలో ఉన్నాయి. అన్నింటిలోకి సిద్ధార్థ్ మల్హోత్రా సరసన నటిస్తోన్న వీవాన్ ఫోర్స్ ది ఫారెస్ట్ ముందు రిలీజయ్యే అవకాశం ఉంది. తాజాగా కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఈ సినిమాలోని సమఝోనా అనే పాటను విడుదల చేశారు. ఈ సాంగ్ లాంచ్ కార్యక్రమం శుక్రవారం ముంబైలో జరిగింది. ఈ సందర్భంగా సిద్ధార్థ్- తమన్నాల కెమెస్ట్రీ అదిరిపోయింది. సమజోనా పాటను పాడుతూ.. మోకాళ్లపై కూర్చోని తమన్నాకు ప్రపోజ్ చేస్తున్నట్లుగా సిద్ధార్థ్ ఉండగా.. మిల్కీబ్యూటీ చిరునవ్వులు చిందిస్తూ సిగ్గుపడింది. అలాగే షూటింగ్ సమయంలో జరిగిన కొన్ని సంఘటనలను సిద్ధార్థ్ పంచుకున్నారు.



# మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు

సాధారణ డిస్ట్రిబ్యూటర్‌గా కెరీర్ ప్రారంభించి.. నిర్మాతగా మారి ప్రస్తుతం టాలీవుడ్‌తో పాటు భారతీయ సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు దిల్‌రాజు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై 60కి పైగా సినిమాలు చేయడంతో పాటు ఎందరో హీరోలను, హీరోయిన్లను, దర్శకులను, ఇతర టెక్నీషియన్లను వెండితెరకు పరిచయం చేశారు రాజుగారు. దిల్‌రాజు బ్యానర్ నుంచి సినిమా వస్తుందంటే ఖచ్చితంగా దానిలో విశేషం ఉంటుందని ప్రేక్షకులు నమ్ముతారంటే చిత్ర పరిశ్రమపై ఆయన ఎలాంటి ముద్రవేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు చిత్ర పరిశ్రమను శాసించే వ్యక్తుల్లో ఒకరిగా.. నైజాం కింగ్‌గా అభిమానులను దిల్‌రాజును పిలుచుకుంటారు. ఆయన మాటలు, చేతలు ఖచ్చితంగా ఇండస్ట్రీపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దిల్‌రాజు ఓ ప్రాజెక్ట్ డీల్ చేస్తున్నారంటే ఖచ్చితంగా ఎన్నో లెక్కలు వేసుకుంటారని, ఆయన జడ్జిమెంట్ తప్పదని ఇండస్ట్రీ జనాల నమ్మకం. ఒక సినిమా రష్ చూసి అది ఎన్ని రోజులు ఆడుతుంది? ఎంత వసూలు చేస్తుంది? అనేది లెక్కలతో సహా చెప్పగల మేధావి దిల్‌రాజు. గత కొన్నేళ్ల వరకు ఆయన పట్టిందల్లా బంగారం అన్నట్లుగా సాగింది. స్టార్స్‌తో సినిమాలు తీసినా.. కొత్త వారిని పరిచయం చేసినా భారీ వసూళ్లతో బ్రాండ్ సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. అయితే కొద్దికాలంగా రాజుగారి లెక్కలు తప్పుతున్నాయి. సినిమాల నిర్మాణంతో పాటు డిస్ట్రిబ్యూషన్ పరంగానూ భారీ నష్టాలు మూటకట్టుకుంటున్నారు. ఇటీవల టాక్సిక్ మూవీ ఆంధ్రా- నైజాం రైట్స్‌ని ఏకంగా 100 కోట్లకు పైగా వెచ్చించి సొంతం చేసుకున్నారు దిల్‌రాజు. యశ్ నటించిన ఈ సినిమా తొలిరోజు నుంచే డివైడ్ టాక్ తెచ్చుకుంది. సినిమాలు, డిస్ట్రిబ్యూషన్ మాత్రమే కాదు.. తన సామ్రాజ్యంగా చెప్పుకునే నైజాంలోకి బడా నిర్మాతలు అడుగుపెట్టడంతో ఆయన కోట బీటలు వారుతోంది. ఎంతమంది వచ్చినా తన మార్క్ చూపిస్తూ, ఎన్ని కష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడుతున్నారు దిల్‌రాజు. ఈ జనరేషన్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా ఘనత సాధించిన ఆయన.. గత కొంతకాలంగా ఇండస్ట్రీలో తీరుతెన్నులు... పెరిగిన ప్రొడక్షన్ ఖర్చులు తదితర అంశాలపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఓ సినిమా ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన దిల్‌రాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. కోర్ట్ మూవీతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న కొత్త కుర్రాడు హర్ష్ రోషన్ నటించిన లేటెస్ట్ మూవీ తెల్ల కాగితం. నక్షత్ర హీరోయిన్‌గా నటిస్తున్నారు. దీపక్, అజయ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తుండగా.. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌పై కృష్ణ కొమ్మాలపాటి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. నందు సవరిగాన కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. విజయ్ బుల్గాని సంగీత దర్శకత్వం వహించగా.. కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా, కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తించారు. త్వరలోనే తెల్ల కాగితం మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను సెప్టెంబర్ 5వ తేదీన హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దిల్‌రాజ్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మీ జీవితం తెల్లకాగితం అయితే అందులో ఎర్ర మచ్చ ఏంటీ అని యాంకర్ స్రవంతి అడగ్గా.. దానికి దిల్‌రాజు స్పందించారు. ఎవరి జీవితంలోనూ తెల్ల కాగితం ఉండదు, జీవితంలో తెలిసి తెలియక అందరూ తప్పులు చేస్తుంటారు. తెల్ల కాగితం మీద ఎర్ర మచ్చ పడితే ఎలా ఉంటుందనేది ఈ సినిమా కథ. ఇప్పుడున్న సొసైటీలో మంచిగా ఉందామన్నా బతకనివ్వడం లేదు.. కాబట్టి వాళ్ల కోసమైనా మనం చెడుగా ఉండాల్సిందే. తెల్ల కాగితం టైటిల్‌కు ఇన్నోసెంట్ లవ్ అనే క్యాప్షన్ పెట్టమని చెప్పాను. ఈ స్టోరీ విన్నప్పుడు కొత్త బంగారం లోకం అనే సినిమాను 18 ఏళ్ల క్రితం తీసినప్పుడు ఎలా ఫీలయ్యానో అలాగే అనిపించింది. 2000వ సంవత్సరంలో జరిగిన యథార్ధ సంఘటనల ఆధారంగా ఈ తెల్ల కాగితం సినిమాను తీశారు. ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఆకాంక్షిస్తున్నా. ఈ సినిమాను చూజి ఈ తరం తమ జీవితంలో ఎర్ర మచ్చ పడుకుండా జాగ్రత్త పడాలనేది ఈ కథ. మా కృష్ణతో నాది 20 ఏళ్ల జర్నీ.. ఎప్పుడూ ఏమీ అడగడు, అడిగినప్పుడు అండగా నిలబడాలి కదా? అని దిల్‌రాజు వ్యాఖ్యానించారు. ప్రస్తుతం దిల్‌రాజు వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి.





# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' ట్రైలర్ రిలీజ్

'బేబీ' మూవీ సక్సెస్ తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా రాబోతున్న కొత్త సినిమా 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్'. ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ కి ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఎస్. నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 11న ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ట్రైలర్ రిలీజ్ చేసి సినిమాపై అంచనాలు పెంచారు.



# 200 కోట్ల క్లబ్‌లో రవితేజ 'ఇరుముడి'

మాస్ మహరాజ్ రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించింది. ఈ చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఫలితంగా ఈ చిత్రం రూ.200 కోట్ల వసూళ్లను రాబట్టినట్టు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ చిత్రం ఇంతటి భారీ విజయానికి గల కారణాలను పరిశీలిస్తే, ఎక్కువగా మాస్ యాంగిల్‌లో కనిపించే రవితేజ ఇందులో భిన్నమైన పాత్రలో కనిపించారు. సాధారణ మధ్యతరగతి తండ్రి (త్రినాథ్)గా కనిపించారు. కూతురి ప్రేమకోసం పరితపించే తండ్రిగా భావోద్వేగభరితమైన నటనతో ఆకట్టుకున్నారు. ఆయన అభినయం విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తెలుగు ప్రజలకు, ముఖ్యంగా అయ్యప్ప స్వామి భక్తులకు బాగా తెలిసిన ఇరుముడి దీక్ష గురించి ఈ సినిమాలో చూపించారు. ఈ అంశం ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. తన ప్రాణమైన కూతురు మణెమ్మ (బేబీ నక్షత్ర) కోసం రవితేజ 41 రోజుల అయ్యప్ప దీక్షను స్వీకరిస్తారు. ఆ దీక్ష ఆయన జీవితాన్ని ఎలా మార్చిందనేది కథలో కీలకమైన అంశం. ఈ రెండు అంశాలకు తోడు సెంటిమెంట్‌తో పాటు ఊహించని మలుపులు, క్లైమాక్స్ ట్విస్ట్ ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేశాయి. ఇది కూడా సినిమా విజయానికి ఓ కారణంగా చెప్పొచ్చు. అలాగే, ఓ తండ్రిగా తన కూతురిపై ప్రేమ చూపించడమే కాదు, సమాజంలో అమ్మాయిలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా హీరో పోరాటం చేయడం కూడా ప్రేక్షకులను కదిలించింది.ఇతపోతే, చివరగా తెలుగు ప్రజలకు బాగా సుపరిచితమైన 'మల్లెపూల పల్లకి' పాటను ఈ సినిమాలో చూపించడం ప్లస్ పాయింట్. అభిమానులు ఆ పాటకు థియేటర్లలో భజనలు చేశారు. 'యాలాలో.. యాలాలో', 'కార్తీకమాసం' పాటలూ ఆకట్టుకున్నాయి. ఇలా అన్ని అంశాలు కలిసిరావడంతో ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ మూవీగా నిలిచింది.

# 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి

ప్రస్తుతం యువతలో బాగా ట్రెండ్ అవుతున్న 'డెలులు' అనే పదమే టైటిల్‌గా తెరకెక్కుతున్న చిత్రం 'డెలులు'. క్రియేటివ్ లాంచ్‌ప్యాడ్ బ్యానర్‌పై సంకీర్త్ కొండ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రీతం కస్తూరి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ రాజ్‌కుమార్ కథ, అదనపు సంభాషణలు అందించగా.. రెష్మిత్ ఎస్. కౌశిక స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాశారు. టైటిల్ నుంచే విభిన్నంగా అనిపిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. యువతరం నటీనటులతో తెరకెక్కుతున్న 'డెలులు' మూవీ టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఒక నిమిషం 32 సెకండ్ల నిడివి ఉన్న ఈ టీజర్.. 'బ్రేకప్ దేవా' అనే డైలాగ్‌తో ప్రారంభమవుతుంది. ఆ తర్వాత వచ్చే సన్నివేశాలు, పాత్రల మధ్య జరిగే సరదా సంభాషణలు టీజర్‌కు మంచి ఫన్ టచ్‌ను తీసుకొచ్చాయి. టీజర్‌లోని పలు డైలాగ్స్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. 'ఆడదానివైన నువ్వు.. చీప్‌గా ఓ మగాడి కోసం మారతావా అంటావా.. సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా నీకు', 'నువేమైనా ఫాదర్ ఆఫ్ ఇండియానా?', 'నువ్వు అత్తాపూర్‌కు రారా.. నీళ్ల ట్యాంకర్ దగ్గర ఆడోళ్లతో కొట్టిస్తా', 'కుక్కకు పుట్టినవా నువ్వు' వంటి డైలాగ్స్ టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఈ డైలాగ్స్, కామెడీ సన్నివేశాలు సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఓ ఇంటి నేపథ్యంలో చోటుచేసుకునే సరదా సంఘటనలు, పాత్రల మధ్య కెమిస్ట్రీ టీజర్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కామెడీతో పాటు కుటుంబ ప్రేక్షకులను అలరించే అంశాలకు కూడా సినిమాలో ప్రాధాన్యత ఇచ్చినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. మొత్తంగా టీజర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించేలా ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌కు మంచి స్పందన రాగా.. తాజాగా వచ్చిన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. సాంకేతికంగా కూడా 'డెలులు'కు మంచి బృందం పనిచేస్తోంది. జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. హరికృష్ణ కురపాటి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆది చెబ్రోలు సంగీతం అందిస్తున్నారు. టీజర్‌లో సంగీతం కూడా సన్నివేశాలకు తగ్గట్టుగా ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో విజయ్ రాజ్‌కుమార్, వేణి రావు, అఖిల్ జాక్సన్, సాయి ప్రసన్న, శ్రీ రామ మండవ, అభినయ్ తుల తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యువతను టార్గెట్ చేసే ఫన్, కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్ అంశాలతో 'డెలులు' చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. టీజర్‌కు వస్తున్న స్పందనతో 'డెలులు' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన టైటిల్, కామెడీతో కూడిన కథనం, ఫన్ ఎలిమెంట్స్ సినిమాకు ప్లస్‌గా మారే అవకాశముంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా హీరో మాట్లాడుతూ.. నా సినిమాలో దమ్ము లేకుంటే విమ్ముకొని నిలబడ్డా ఎవ్వడూ చూడడు.. కాంట్రవర్సీలతో కాదు కంటెంట్ తో వస్తున్నాం. కేవలం కంటెంట్ బలంతోనే మా సినిమా నిలబడుతుంది కానీ ప్రమోషన్స్ లో ఎలాంటి కాంట్రవర్సీలకు పోయే ప్రసక్తే లేదు అని అన్నారు.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342